
UESI

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.2

December 2022



## క్రిస్మస్ విశిష్టత





# హృదయంలో క్రీస్తు జన్మిస్తే...

ఇంగ్లాండ్‌లోని స్ట్రాట్‌ఫోర్డ్-అపాన్-ఏవన్ అనేది ఒక సుందరమైన గ్రామం. ప్రతి సంవత్సరం ఈ గ్రామాన్ని సుమారు 5లక్షల మంది సందర్శకులు దర్శిస్తూ ఉంటారు. ఇది గొప్ప ఆంగ్ల రచయిత విలియం షేక్స్‌పియర్ జన్మస్థలం. కేవలం ఒక మనిషి పుట్టుక కారణంగా ఆ గ్రామం యొక్క గుర్తింపు, భవిష్యత్ ఎంతో మారిపోయింది.

మరి బెత్లెహేము సంగతి ఏంటి? క్రీస్తు పుట్టుకతో మీకా ప్రవచనం నెరవేరింది. "బెత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వత కాలము ఆయన ప్రత్యక్షమగుచుండెను" (మీకా 5:2). ప్రపంచంలో స్వల్ప గ్రామమైన బెత్లెహేమును టూరిజం లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు 35 లక్షల మంది దర్శిస్తారు. యేసు జన్మతో బెత్లెహేము ఎంత గొప్ప ప్రాధాన్యతను సంతరించుకొంది.

ఇది వ్యక్తుల జీవితంలో కూడా సత్యమే. దమస్కు మార్గంలో పౌలు జీవితంలో క్రీస్తు జన్మించాడు. తర్వాత అతని జీవితమే మారిపోయింది. అతను క్రీస్తుకు సంపూర్ణంగా సమర్పించుకొన్నాడు. "....ఇక జీవించువాడను నేనుకాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" (గలతీ 2:20) అని చెప్పాడు. అతని జీవిత లక్ష్యం, గమ్యం పూర్తిగా మారిపోయాయి. "క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటించవలెనని" (రోమా 15:21) ఆశ కలిగి మూడు సువార్త దండయాత్రలు చేసి, రెండు ఖండాల్లో, అనేక మెట్రోపాలిటన్ నగరాల్లో క్రీస్తు సాక్ష్యాన్ని స్థాపించి, స్థిరపరచాడు. అనేకుల్ని ప్రభువులోకి నడిపించాడు. పరిశుద్ధాత్ముని ప్రేరణతో కొత్తనిబంధనలో 14 పుస్తకాలు రాశాడు. ఒక వ్యక్తిలో క్రీస్తు జన్మిస్తే, అతను దేవునికి సమర్పించుకొంటే అతని జీవితం ఇంత మహోన్నతంగా ఉంటుందా అని ప్రపంచమే ఆశ్చర్యపోతుంది.

ఈ లోకంలోని గొప్ప వ్యక్తులు పుట్టిన ప్రదేశాలు, వారి జీవితం కొంతవరకు ప్రభావితం చూపించవచ్చుగానీ, నిజదేవుడైన క్రీస్తు వ్యక్తుల మీద చూపించే ప్రభావాన్ని అంచనా వేయలేము.

మనం మన పాపాలను ఒప్పుకొని క్రీస్తును విశ్వసించినప్పుడు ఆయన మనలో జన్మించాడని, విశిష్టమైన వ్యక్తులంగా మనల్ని మార్చాడని మనకు తెలుసు. ఆ విశిష్టత లోకానికి తెలియాలంటే పౌలులా మనం కూడా ఆయనకు సంపూర్ణంగా సమర్పించుకోవాలి. మన దేహం దేవుని ఆలయం, దేవుని ఆత్మ మనయందు నివసించుచున్నాడు. మనం మన సొత్తుకాదు, విలువపెట్టి కొనబడినవారం గనుక మన దేహాలతో ఆయనను మహిమపరచాలి (1 కొరింథీ 3:16; 6:19). రోమా 12: 1-3 ప్రకారం మన శరీరములను ఆయనకు సజీవయాగంగా అర్పించుకోవాలి. ఎవరైతే తమ్మునుతాము దేవునికి అప్పగించుకొంటారో వారు తమకు కలిగిన ధనాన్ని, సమయాన్ని, తలాంతులను దేవుని పరిచర్యలో సంపూర్ణంగా వాడడానికి ఏమాత్రం వెనుకాడరు.

త్రివేంద్రంలో జన్మించి, చెన్నైలో ప్రొఫెసర్‌గా పనిచేసిన ఇనాక్ గారు ఒక సామాన్యుడు. క్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించి, ఆయన మాటలకు అనుగుణంగా తన జీవితాన్ని మార్చుకొని, ఆయన మాటలకు సంపూర్ణ విధేయత చూపించినందున భారతదేశంలోని కళాశాల విద్యార్థుల జీవితాల్ని క్రీస్తు కొరకు ప్రభావితం చేయడానికి దేవుడు ఆయనను ఉపయోగించుకొన్నాడు. 67 సం॥ల క్రితం కొద్దిమందితో ప్రారంభమైన యుఇయస్ఐ ఈ రోజున వేల కొలది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తుందంటే కారణం ఆయన సమర్పణే.

మన జీవితాన్ని కూడా ఆయనకు సంపూర్ణంగా సమర్పించుకొని, ఆయన మనకు అప్పగించిన పరిచర్యలో అలుపెరుగక శ్రమిస్తూ ఉంటే మనం కూడా క్రీస్తు జన్మ విశిష్టతను ఈ లోకానికి చాటిచెప్పే చిహ్నాలుగా, సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసేవారిగా చరిత్రలో నిలిచిపోతాము.

"ఈ క్రిస్మస్ సమయంలో దేవునికి శ్రేష్టమైనదేదైనా ఇవ్వండి. కేవలం మీ హృదయమే గాక, మీ చేతులు, దేహము, ఆత్మ, మనస్సు, మీ సంపూర్ణ వ్యక్తిత్వం ఆయనకు సమర్పించండి" అని అంటాడు హేడెన్ రాబిన్‌సన్. మన స్పందన ఏంటి?

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల

Vol. 29, No.2 December 2022
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

January 2023: God's Guidance

February: Discipleship

**Note:** Please send your writeups on or before
**10th of every month**


## కొత్త అవకాశాల కోసం....

క్రిస్మస్ సీజన్ వస్తుందంటే సంతోషించండి. కొత్తబట్టలు, చుట్టాలు, ఇంటికి సున్నాల కోసం కాదు గానీ దేవుని సువార్తను చాటి చెప్పడానికి కొత్త అవకాశాల కోసం. ప్రభువా క్రిస్మస్ సీజన్ కోసం ఎదురు చూస్తున్నా... నీ సువార్త చెప్పడానికి కొత్త అవకాశాలివ్వు, మిమ్మును ఎరుగని వారి మనసుల్లో మీరు ఉదయించే సందేశాన్ని ఇవ్వండి. మా స్నేహితులకు, బంధువులకు, తోటి వారికి సువార్త అందాలని ప్రార్థించే మనసు ఇవ్వండి. ప్రభువా క్రిస్మస్ పేరున అనేకులు నిన్ను గూర్చి తెలుసుకొనే భాగ్యం ఇవ్వండి అని ప్రార్థన చేద్దాం, అవకాశాలను అందిపుచ్చుకొందాం.

*విద్యార్థిజ్వాల మీ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తుంది.*

## లోపలి పేజీల్లో...



- హృదయంలో క్రీస్తు జన్మిస్తే - 2
- క్రీస్తు కన్యకకు జన్మించడం - 4
- క్రిస్మస్ తార - 7
- యేసు చారిత్రక పురుషుడా? - 8
- దైవమానవుడైన క్రీస్తు - 12
- కరోనాలో క్రిస్మస్ సందేశం - 16
- పాత నిబంధనకు కేంద్రం క్రీస్తే - 18
- క్రాస్ వర్డ్ పజిల్ - 20
- ఈ తరం.. మన తరం.. - 21
- అదే నా జీవితంలో గొప్ప మలుపు - 25
- క్రిస్మస్‌కి స్పందన - 27
- చెంగుచెంగుమంటున్న గొర్రెపిల్ల - 28
- సకల ప్రజలకు శుభవార్త - 29
- యేసుక్రీస్తు ఎందుకు రాలేదో తెలుసా? - 29
- క్రీస్తుకోసం మరొక్కరు - 30
- కోశాధికారి లేఖ - 31
- పండగలెందుకు? - 32

కవర్ కథనం

# క్రీస్తు కన్యకకు జన్మించడం?

**1. అసాధారణ సంఘటన**

"ఇదే క్రిస్మస్.. ఇదే క్రిస్మస్..." అని పాడుతూ పిల్లలు క్రిస్మస్ నాటిక వేస్తున్నారు. మరియమ్మలా నటిస్తున్న ఒక చిన్నపాప చేతుల్లో ఉన్న బొమ్మ చూడడానికి చాలా అందంగా ఉంది. ఒక ఆలోచన నా మనసులో మెదిలింది. "ఆ పాప చేతులలో ఉన్న బొమ్మ నిజమైన బిడ్డ అయ్యుంటే ఎలా ఉంటుంది? ఆ బొమ్మ ఒక బాలుడై ఉంటే ఎలా ఉంటుంది? ఆ చిన్న పాప వేదిక మీద భయం భయంగా ఉన్నది. తర్వాత ఏ డైలాగు చెప్పాలో గుర్తు చేసుకొంటూ, తన సండే స్కూల్ టీచర్ వైపు చూస్తుంది. బహుశా యవ్వనదశలో ఉన్న కన్యయైన మరియ భావోద్రేకాలు ఎలా ఉండి ఉంటాయో? ఆమె వయసులో చాలా చిన్నదే కాని ఎంతో అవమానాన్ని, శ్రమను భరించింది. రాళ్ళతో కొట్టబడి చంపబడేందుకు సిద్ధమైయ్యింది. మెస్సయ్య జననం నిజం. అదేవిధంగా ఆయన కన్యకకు జన్మించడం అనేది కూడా నిజం. క్రిస్మస్ మన అందరికీ ఒక సంతోషకరమైన వేడుక. కానీ మరి యకు అది సంతోషకరమైన వేడుక కాదు. అంతటి కఠినమైన పనిని చేయమని మరియను దేవుడు ఎందుకు కోరాడు? ఒక అవిశ్వాసికి క్రిస్మస్ గురించి, క్రీస్తు కన్యకు జన్మించాడని చెప్పినప్పుడు, అతడు ఎగతాళి చేయవచ్చు. క్రైస్తవులను హేళన చేస్తాడు.



ఇంత కష్టమైన పనిని దేవుడు మనకు ఎందుకు ఇచ్చాడు? క్రీస్తు కన్యకకు జన్మించడం అవసరమా? ఈ విషయాల్ని తెలుసుకొందాం.

### 1. క్రీస్తు కన్యకకు జన్మించడం నిజమా? లేక అది ఒక కల్పిత కథా?

క్రీస్తు కన్యకకు జన్మించాడనే విషయం సువార్తల న్నిటిలో లేదు కాబట్టి, ఈ విషయం ఒక కల్పిత కథే అని కొంతమంది నాస్తికులు వాదిస్తుంటారు. వారు చెప్పేది అసత్యమని స్పష్టంగా అర్థమౌతుంది. మత్తయి సువార్త 1:22-25, లూకా సువార్త 1:34-37లో ఈ విషయం స్పష్టంగా రాయబడినట్లు మనం చూడగలం. మార్కు, యోహానులు తమ సువార్తలలో క్రిస్మస్ విషయాలను ప్రస్తావించలేదు. కాబట్టి ఆ రెండు సువార్తలలో ఈ విషయం మనకు కనిపించదు. కన్యకకు జన్మించడం వివాదాస్పదమైన విషయం, అసత్యమైతే, చరిత్రకారుడు, ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశోధించి తెలుసుకొనే లూకా (1:1-4), ఈ విషయాన్ని తన గ్రంథంలో రాసి ఉండేవాడు కాదు. యేసు తల్లియైన మరియను కలిసి, తానే స్వయంగా ఈ విషయాన్ని తెలుసుకొని, మరికొన్ని విషయాలతో కూడా సరిచేసుకొని, ధృవీకరించుకొన్న తర్వాతే ఈ విషయాన్ని రాసి ఉంటాడు. మత్తయి, లూకా సువార్తలను ఆధారం చేసుకొని క్రీస్తు కన్యకకు జన్మించాడనే విషయాన్ని స్పష్టంగా, నిస్సందేహంగా చెప్పవచ్చు. మనం అద్భుతాలను నమ్మగలిగేవారమైతే ఈ విషయాన్ని కూడా మనం నమ్ముతాము. శూన్యము నుండి దేవుడు ఈ విశ్వాన్ని సృజించాడని మనకు తెలుసు (ఆది 1:1,2). ఆయన నీటిని ద్రాక్షారసంగా మార్చాడు (యోహాను 2). మరణించిన లాజరును నాలుగు రోజుల తర్వాత లేపాడు (యోహాను 11). అదే విధంగా, ఒక కన్యక ద్వారా అద్భుతరీతిలో క్రీస్తు ఈ లోకానికి వచ్చాడు.

### 2. ప్రవచనాత్మకం

మెస్సయ్య పుట్టుకను గూర్చి, పాతనిబంధనలోని ప్రవక్తలు ప్రవచించారు. క్రీస్తు దైవత్వాన్ని రుజువు చేసే వాటిలో కన్యక జన్మ ఒక అత్యంత విశిష్టమైన రుజువు. క్రీస్తు జన్మను ఆదికాండం 3:15లో దేవుడు ముందుగానే ప్రవచించాడు. ఒక స్త్రీకి జన్మించే సంతానం సర్పము తలను చితక గొడతాడని దేవుడు సర్పంతో చెప్పాడు. "మరియు నీకును స్త్రీకిని, నీ

**ఒక తత్వవేత్త ఒకసారి ఇలా చెప్పాడు: "మనం హిస్టరీని నమ్మాలి, అది మిస్టరీ అయినప్పటికీ కూడా".**

సంతానమునకును ఆమె సంతానమునకు వైరము కలుగజేసెదను. అది నిన్ను తల మీద కొట్టును, నీవు దాని మడిమ మీద కొట్టుదువని చెప్పెను" (ఆది 3:15). క్రీస్తు పుట్టక మునుపు 700 సం॥ల క్రితం యెషయా అనే ప్రవక్త యేసుక్రీస్తు కన్యకకు జన్మిస్తాడని ప్రవచించాడు."కాబట్టి ప్రభువు తానే యొక సూచన చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేల ను పేరు పెట్టును" (యెషయా 7:14).

మత్తయి తన సువార్తలో క్రీస్తు కన్యకకు జన్మిస్తాడని యెషయా చెప్పిన ప్రవచనం నెరవేరిందని రాస్తూ, యెషయా ప్రవచనాన్ని తన సువార్తలో ఉటంకించాడు (మత్తయి 1:22,23). యవ్వనురాలైన స్త్రీ అని యెషయా రాశాడు, అయితే ఆ పదాన్ని మత్తయి తప్పుగా అర్థం చేసుకొని కన్యక అని రాశాడని కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేస్తుంటారు. యెషయా ఉపయోగించిన 'అల్మా' అనే హెబ్రీ పదాన్ని "యవ్వనురాలైన స్త్రీ" లేదా "కన్యక" అని తర్జుమా చేయవచ్చు. "బెతులా" అనే మరొక హెబ్రీ పదం ఉన్నప్పటికీ, దాని అర్థం కూడా "యవ్వనురా లైన స్త్రీ". కన్యక అనే ఖచ్చితమైన అర్థమిచ్చే పదం యెషయా జీవించిన కాలం నాటి హెబ్రీ భాషలో లేదు. మరొక ముఖ్య విషయం ఏమిటంటే అల్మా అనే పదం పెళ్ళికాని అమ్మాయికి మాత్రమే వాడతారు. కాబట్టి యెషయా "అల్మా గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానియేలు అని పేరు పెట్టును" (యెషయా 7:14) అని చెప్పినప్పుడు పెళ్ళి కాలేదు కాబట్టి, ఇమ్మానియేలుగా దేవుడే జన్మిస్తున్నాడు కాబట్టి కన్యక అని మాత్రమే తర్జుమా చేయాలి. అపోస్తలుడైన పౌలు కూడా ఇలా రాశాడు: "అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను; ఆయన స్త్రీయందు పుట్టి.." (గలతీ 4:4-5) అనే మాటలను ఆది 3:15 నుండి ఉటంకించాడు. కాబట్టి, పురుష ప్రమేయం లేకుండా స్త్రీ నుండి మెస్సయ్య రావాల్సి ఉన్నదని, కన్యక గూర్చి యెషయా ప్రవచించాడు. ఆ ప్రవచనం యేసుక్రీస్తులో మాత్రమే

నెరవేరిందనే విషయాన్ని మత్తయి తెలియజేశాడు. అలాగే మరియ "నేను పురుషుని ఎరుగని దానిని ఇది ఎలాగు జరుగునని" (లూకా 1:34) దూతతో అన్న విషయాన్ని కూడా మనం గమనించి నప్పుడు, ఖచ్చితంగా, ప్రవచనాలను నెరవేరుస్తూ, కన్య మరియకు యేసుక్రీస్తు జన్మించాడనే సత్యాన్ని గ్రహించవచ్చు.

## 3. సాధ్యములు: క్రీస్తు కన్యకకు జన్మించడం సాధ్యమని చెప్పడానికి శాస్త్రీయమైన రుజువులు ఉన్నాయా?

అనిషిక్త జననము అంటే స్త్రీ పురుష సంయోగము లేకుండా లేదా పురుష ప్రమేయం లేకుండానే అండము భ్రూణముగా లేదా పిండముగా అభివృద్ధి చెందే ప్రక్రియ. దీనిని ఆంగ్లములో పార్థినోజెనిసిస్ అంటారు. ఈ ఆంగ్ల పదం "కన్యక జన్మ" అని అర్థమిచ్చే ఒక గ్రీకు పదంనుండి ఉద్భవించింది. పచ్చదోమ, ఈగలు, చీమలు వంటి అనేక కీటక జాతులలో పార్థినోజెనిసిస్ విధానం ద్వారా పునరుత్పత్తి జరుగుతుంది. కొన్ని క్షీరద (పాలిచ్చి పెంచే జంతువుల) జాతులలో కూడా ఇది సాధ్యమని కొందరు శాస్త్రవేత్తల ప్రయోగాలలో రుజువైంది. అయితే, కన్య మరియ గర్భంలో అనిషిక్త జనన ప్రక్రియ జరిగిందని నేను చెప్పడం లేదు. X క్రోమోజోములు, Y క్రోమోజోములకు సంబంధించిన విషయాలను కూడా కొంతమంది తమ వాదనల్లో ప్రస్తావిస్తుంటారు. మరియ గర్భంలో కణవిభజన జరిగిందని చెబుతుంటారు. అయితే ఇలాగే జరిగిందని మనం చెప్పడం లేదు. అది దేవుని అద్భుతకార్యం అని బైబిల్ తెలియజేస్తుంది. బైబిల్ తెలియజేయని విషయాలను ఊహించి చెప్పకుండా మనం జాగ్రత్తపడాలి. దేవుడు శరీరరూపంలో వచ్చి మరియతో కలిశాడని కొందరు అతివాదులు మాట్లాడుతుంటారు. ఇది పూర్తిగా నిరాధారమైన విషయం. "పరిశుద్ధాత్మ శక్తి నీ మీదికి వచ్చును. సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (లూకా 1:35). వెర్న్‌పోయిన్‌ధ్రెస్ అనే వేదాంత పండితుడు ఇలా అన్నాడు: "ఈ విశ్వం ఆధీనంలో దేవుడు లేడు. వ్యక్తిత్వంలేని శక్తివంతమైన నియమావళితో కూడిన ఒక వ్యవస్థలో ఆయన చిక్కుకొనలేదు. దేవుడు అన్నింటికీ నియమాలను ఏర్పరచినవాడు. సాధారణమైన, అసాధారణమైన విషయాలన్నిటికీ మూలం ఆయనే. తన చిత్తానుసారంగా ఆయన అద్భుతాలు చేయగలిన దేవుడు. "మన రక్షణ కోసం సర్వశక్తి గల దేవుడు కన్యక జన్మ అనే అద్భుతాన్ని జరిగించాడు. హల్లెలూయ!! దేవుడు దీనిని మర్మంగానూ, అద్భుతంగానూ ఉంచదలిచాడు. మనం కూడా ఈ విషయాన్ని అలానే ఉంచుదాం.

## 4. అవిశ్వాసులకు జవాబు చెప్పే ప్రక్రియ

కన్యక జన్మ గూర్చి ఎవరైనా ప్రశ్నించినప్పుడు ఈ క్రింది విషయాలను వివరించవచ్చు.

ఎ. అదొక చారిత్రక సంఘటన. క్రొత్త నిబంధన ఒక చారిత్రక గ్రంథము, కన్యక జన్మ అనే విషయాన్ని మత్తయి, లూకాలు తమ గ్రంథాలలో ప్రస్తావించారని చెప్పాలి. ఒక తత్వవేత్త ఒకసారి ఇలా చెప్పాడు: "మనం హిస్టరీని నమ్మాలి, అది మిస్టరీ అయినప్పటికీ కూడా".

బి. అద్భుతాలను సైన్స్ తిరస్కరించదు. దేవుడు జోక్యం చేసుకొన్నప్పుడు అద్భుతాలు జరుగుతాయి. ఆధునిక చరిత్రలో కూడా దేవుడు చేసిన అద్భుతకార్యాలను మనం చూడవచ్చు.

సి. దేవుడు మానవునిగా, మానవ చరిత్రలో చేయబోతున్న గొప్ప ప్రవేశాన్ని ప్రకటించడానికి దేవుడు చేసిన అద్భుతమే కన్యక జన్మ. మానవునిగా దేవుడు ఈ భూమి మీదికి రావాలనుకొంటే, ఆ రాక విశిష్టమైనదిగాను, ప్రత్యేకంగాను ఉండాలి.

డి. యేసుక్రీస్తు పాపరహిత జీవితం, ఆయన చేసిన అద్భుతకార్యాలు, మానవ సమస్యలకు ఆయన చూపిన పరిష్కారాలు, ఆయన మరణం, పునరుత్థానం, ఆరోహణంలను మనం గమనించినప్పుడు, ఆయన కన్యకకు జన్మించాడని మనం ధృఢంగా, ధైర్యంగా నమ్మవచ్చు.

ఇ. మనందరినీ రక్షించబోయే రక్షకుడైన దైవమానవుడు పాపరహితంగా ఉండడానికి కన్యక ద్వారా జన్మించడం ఎంతో అవసరం.

ఎఫ్. యేసుక్రీస్తు కన్యకకు జన్మించాడనే సత్యం ఆయన దైవత్వాన్ని రుజువు చేస్తుంది.

## 5. ప్రాధాన్యత: ప్రాముఖ్యత, అంతర్భావం

మరియకు అది ఎంతో భాధాకరమైన అనుభవం.

అవిశ్వాసులకు ఈ సత్యాన్ని వివరించడం మనకు కష్టమైన విషయం. అయినప్పటికీ దేవుడు ఎందుకు ఈ విషయాన్ని అనుమతించాడు? కన్యక జన్మ యొక్క ప్రాథమిక అవసరం ఏంటంటే, పాపాత్ములైన మానవజాతిని రక్షించడానికి పాపరహితుడైన మెస్సయ్య అవసరం. సాధారణమైన మానవ జన్మ ద్వారా మానవుడు జన్మత: పాపిగా జన్మిస్తున్నాడు. ఆదామునుండి పాపం అన్ని తరాల వారికి, ప్రతి మానవునికి జన్మత: సంక్రమించింది. మన పాపములకు పరిహారాన్ని చెల్లించే ఒక పరిపూర్ణమైన ప్రతినిధిగా, పాపరహితునిగా యేసుక్రీస్తు ఉండాల నే విషయాన్ని కన్యకజన్మ సుసాధ్యం చేసింది. యేసుక్రీస్తు 100% పరిశుద్ధునిగా ఉండాలి, 100% దేవునిగా ఉండాలి, 100% మానవునిగా ఉండాలి. ఈ గొప్ప విషయాన్ని నెరవేర్చడానికి దేవుడు తన అనంత జ్ఞానం ద్వారా కన్యక జన్మ అనే విధానాన్ని ఎన్నుకొన్నాడు. కన్యక జన్మ లేకపోతే, పాపులకు రక్షణ లేదు. కన్యక ద్వారా జన్మించిన యేసుక్రీస్తు ద్వారా దేవుడు మానవులను రక్షించాలనుకొన్నాడనే సత్యాన్ని మనం అర్థం చేసుకోవాలని దేవుడు కోరుకొంటున్నాడు.

ఎ. మన రక్షణను సుసాధ్యం చేసిన కన్యక ద్వారా జన్మించడం అనే ప్రణాళికను ప్రభువు ఎంచుకొన్నందుకు మనం ఆయనకు ఎల్లప్పుడు కృతజ్ఞతాస్తోత్రాలు చెల్లిద్దాం. ఆయనను ఆరాదిద్దాం!

బి. దేవుని ప్రణాళికలను నెరవేర్చేందుకు మరియ వలె మనం కూడా దేవునికి లోబడుదాం, ఆయనకు సమర్పించుకొందాం, ఎలాంటి కష్టమైనా, శ్రమైనా భరిద్దాం.

సి. లోకంలోనికి వెళ్ళి ధైర్యంగా సువార్తను ప్రకటిద్దాం. క్రీస్తు జన్మ విశిష్టమైనదని, సాటిలేనిదని ఎలుగెత్తి చాటుదాం. మనలను తన పిల్లలుగా చేసుకొన్న ఆ దేవాది దేవుని గూర్చి సంతోషిద్దాం, ఆయన పట్ల భయభక్తులు కలిగి జీవిద్దాం. ఇతర సందర్భాలు, కాలాల వంటిది కాదు ఈ క్రిస్మస్. మన సంతోషానికి, మన నిత్యత్వానికి, నిత్యజీవానికి కారణమైన ఘట్టం ఈ క్రిస్మస్!

**– యం. కోదండరామ్,** హైదరాబాద్

**అనువాదం: పి. రామస్వామి,** దర్శి

కవిత

# క్రిస్మస్ తార




మంచు కురిసే వేళ
మంచి మాట చెప్పనా?
తారలొచ్చే వేళ
తీపికబురు చెప్పనా?
ఆకసంలో కొత్తతార
వచ్చింది
ఆనందాల ఆశలు తెచ్చింది
నింగిలోని తారలన్నీ
తొంగిచూశాయి
వింత తార ఎక్కడిదనీ?
అంత కాంతి ఎందుకనీ?
నింగి మురిసి నవ్వింది
నవ్వి ఇలా చెప్పింది..
దూతల గీతం వినలేదా?
జ్ఞానుల పయనం కనలేదా?
గొల్లల పరుగు చూడలేదా?
మరియ మురిపెం
తెలియలేదా?
లోకరక్షకుడు యేసుక్రీస్తు పేరుతో పుట్టాడు
పాప ప్రాయశ్చిత్తం కోసం
రక్తమాంసం తొడిగాడు
స్వర్గానికి మార్గం
భూమిమీదకొచ్చింది

అందుకే ఆ తార...
మీరూ చెప్పండి నోరారా!

**– గొంగటి మేరిజాయ్,** ఆదోని

# యేసు చారిత్రక పురుషుడా?

## బైబిలేతర ఆధారాలు



క్రైస్తవ్యం ఇతర మత విశ్వాసాలకంటే అద్వితీయమైనది. క్రైస్తవేతర మతాలకు, వాటిలోని వ్యక్తుల బోధలు, అవలంభించవలసిన ఆచారాలు ప్రాముఖ్యమైతే, క్రైస్తవ్యానికి యేసుమాత్రమే కేంద్ర బిందువు. యేసు బోధలకంటే కూడా ఆయన విలక్షణత క్రైస్తవ విశ్వాస సత్య ప్రామాణికతకు ఆధారం. అందుకే యేసు లేని క్రైస్తవ్యం శూన్యంగా మిగిలిపోతుంది. క్రైస్తవ జీవితానికి, అనుభవాలకు చరిత్రకు విడదీయరాని సంబంధం ఉంది. చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలకు మన వ్యక్తిగత జీవితానికి మధ్య పొంతన ఉంది. యేసు సిలువ మరణం, సమాధి, పునరుత్థానం లాంటి చారిత్రక సంఘటనలకు మానవుల వ్యక్తిగత జీవితాలకు సంబంధం ఉంది అని బైబిల్ చెబుతుంది. యేసు మరణ పునరుత్థానాలు చారిత్రక సంఘటనలు అయినప్పటికీ మానవాళి పాప ప్రక్షాళన కొరకు జరిగాయనేది క్రైస్తవ విశ్వాసం. క్రీస్తు మన పాపముల నిమిత్తం మృతిపొంది, సమాధిచేయబడ్డాడని, మూడవ దినమున లేచాడని లేఖనం చెబుతుంది. అదే అపొస్తలులు ప్రకటించిన సువార్త కూడా (1 కొరింథీ 15:2-4).

యేసు జీవితం, మరణ పునరుత్థానాలు చారిత్రక సత్యాలు కాకపోతే క్రైస్తవ విశ్వాసం వ్యర్థం, కోట్లాది క్రైస్తవుల నిరీక్షణ ఒక భ్రమగా మిగిలిపోతుంది. ఆయన చారిత్రక పురుషుడు, మరణాన్ని జయించిన వ్యక్తి అయితే క్రైస్తవుల విశ్వాస సత్యాలు చారిత్రక ఆధారాలతో ఋజువు అవుతాయి. అందుకే యేసు చారిత్రక పురుషుడా? ఆయన ఎవరు? లాంటి ప్రశ్నలు కేవలం క్రైస్తవ్యానికే కాదు యావత్ ప్రపంచ ప్రజలందరికీ సంబంధించిన అత్యంత ప్రాధాన్యతగల ప్రశ్నలు.

“యేసుక్రీస్తు జీవించాడో లేదో చారిత్రకంగా పూర్తిగా సందేహమే, ఒకవేళ జీవించినా కూడా ఆయన గురించి మనకు ఏమీ తెలియదు అన్నాడు” బెట్రాండ్ రస్సెల్ అనే నాస్తికుడు (“Why I am not a Christian” Routledge, 2005, p-63). రస్సెల్ మాటలు నిజమా? లేక బాధ్యతా రాహిత్యమైన వ్యాఖ్యలా? గమ్మత్తయిన విషయం ఏంటంటే రస్సెల్ చరిత్రకారుడు కాదు, తాత్వికుడు. అయితే చరిత్రకారుల అభిప్రాయాల్ని చారిత్రక ఆధారాల్ని పరిశీలించాక ఒక అభిప్రాయానికి రావడం సత్యశోధకుల లక్షణం.

సాదా సీదా వడ్రంగి జీవితాన్ని గడిపిన యేసు చరిత్రపై చెరగని ముద్ర వేశాడు అనేది నిస్సందేహంగా నిజం. ఆయన ఇప్పటికీ వ్యక్తుల జీవితాలను ప్రభావితం చేస్తున్నాడు అంటే అతిశయోక్తికాదు. ఆయన మరణించిన 150 సంవత్సరాల లోపు ఎంత మంది క్రైస్తవేతరులు ఆయనను గురించి తమ రచనల్లో ప్రస్తావించారో పరిశీలిస్తే, కనీసం 10 మంది క్రైస్తవేతరులు చరిత్రలో కనిపిస్తారు. యేసు మరణించే నాటికి రోమా సామ్రాజ్యాన్ని పాలిస్తున్న తిబెరి కైసరు గురించి కేవలం 9మంది మాత్రమే ప్రస్తావించారు. అయితే క్రైస్తవ మూల గ్రంథాలను

కూడా పరిగణలోనికి తీసుకొంటే యేసును గురించి 43 మంది గ్రంథకర్తలు, కైసరు గురించి కేవలం 10మంది మాత్రమే ప్రస్తావించడం గమనార్హం. కాబట్టి ఎవరికి ఎక్కువ చారిత్రక ఆధారాలు, సాక్ష్యాధారాలు ఉన్నాయో ఇట్టే అర్థమౌతుంది. యేసు చారిత్రక పురుషుడు కాకపోతే ఎవ్వరినీ ప్రాచీన చారిత్రక పురుషుడుగా అంగీకరించలేము.

**యేసును గురించి ప్రస్తావించిన క్రైస్తవేతర రచనలను పరిశీలించే ప్రయత్నం చేద్దాం.**

**థేలస్:** యేసును గురించి ప్రస్తావించిన అత్యంత ప్రాచీన గ్రంథం సుమారు క్రీ.శ. 55లో చరిత్రకారుడైన థేలస్ గ్రీకు భాషలో రాసిన మూడు సంపుటాలు తూర్పు మధ్యధరాప్రాంత చరిత్ర. అత్యధిక ప్రాచీన సాహిత్యం నశించిపోయినట్లే ఇతని రచనల్లోని అధికభాగం కోల్పోయినప్పటికీ, థేలస్ రచనని జూలియస్ ఆఫ్రికేనస్ (160-240 ఏడి) అనే క్రైస్తవ రచయిత తను రాసిన "ప్రపంచ చరిత్ర" (220 ఏడి)లో ప్రస్తావించడం జరిగింది. యేసు సిలువ వేయబడినప్పుడు కలిగిన అసాధారణ చీకటికి కారణం సూర్యగ్రహణం అని థేలస్ ప్రతిపాదిస్తూ రాయడం జరిగింది (మత్తయి 27:45; మార్కు 15:33; లూకా 23:44). దానిని ఖండిస్తూ పస్కా సమయంలో యేసు చనిపోయాడని, ఎప్పుడూ పౌర్ణమి సమయంలోనే పస్కా పండుగనాచరిస్తారు గనుక ఈ సూర్యగ్రహణం పౌర్ణమి సమయంలో సంభవించదు గనుక చీకటికి కారణం సూర్యగ్రహణం అని థేలస్ పొరబడ్డాడని ఆఫ్రికేనస్ తన రచనలో ప్రస్తావించడం జరిగింది.

**ప్లినీ ద యంగర్:** ఈయన 61 ఏడి- 113 ఏడి మధ్యకాలంలో జీవించాడు. రోమా పాలక సభాసభ్యుడు, ప్రముఖ న్యాయవాది. రాచరిక కాలంలో అనేక ప్రాముఖ్యమైన ప్రభుత్వ అధికార బాధ్యతల్ని నెరవేర్చాడు. క్రీ.శ. 111-113 మధ్యకాలంలో పొంతు మరియు బితూనియ ప్రాంతానికి గవర్నర్‌గా పనిచేసినప్పుడు ట్రాజన్ చక్రవర్తికి ఉత్తర ప్రత్యుత్తరాలు రాయడం జరిగింది. క్రీ.శ. 112లో అతను రాసిన 10వ పుస్తకం 96వ ఉత్తరంలో క్రీస్తును గురించి, క్రైస్తవుల గురించి ప్రస్తావించాడు. క్రైస్తవుల్ని ఎలా శిక్షించాలి? విచారణ దేని ఆధారంగా జరపాలి, ఎంత మేరకు జరపాలి? క్రైస్తవ్యాన్ని త్యజించమనడానికి వయసు విషయంలో ఏమైనా వ్యత్యాసం చూపించవచ్చా? కేవలం క్రైస్తవులైనందుకు వారిని శిక్షించవచ్చా? లాంటి చాలా ప్రశ్నలకు జవాబులు కోరుతూ ఉత్తరాలు రాశాడు. "ఒక నిర్ణీత దినాన తెల్లవారకముందే క్రైస్తవులందరూ క్రమం తప్పకుండా ఒక చోట కలుసుకొని, దేవుడన్నట్లుగా క్రీస్తుకు కీర్తనలు పాడతారనీ, దొంగతనం, వ్యభిచారం, ఇచ్చినమాటతప్పడం లాంటి వాటికి దూరంగాఉంటూ ఏ నేరం చేయకుండా ఉంటామని ప్రతినబూనతారు." అని రాయడం జరిగింది. ఈ ఉత్తరంలో క్రీస్తు పేరుని మూడుసార్లు ప్రస్తావించాడు. క్రీస్తు, క్రైస్తవులు ఆరాధించే దైవనాయకుడని, ఆయనను శపించడం అంటే క్రైస్తవ్యాన్ని తృణీకరించడంతో సమానమని క్రైస్తవులు భావించే వారని తన రచనల్లో పేర్కొన్నాడు.

**గాయస్ సుటోనియస్ ట్రాన్‌క్విలస్ (70 ఏడి - 140 ఏడి):** రోమాలో న్యాయవాదిగా పనిచేసిన రోమా రచయిత. హేడ్రియన్ చక్రవర్తికి కార్యదర్శిగా సుమారు క్రీ.శ. 120లో కొద్దికాలం పనిచేశాడు. జూలియస్ సీజర్ నుండి డొమిషియన్ వరకు 12మంది చక్రవర్తుల జీవితాల గురించి "సీజరుల జీవితాలు" పుస్తకం రాయడం జరిగింది. క్లాడియస్ చక్రవర్తి (41 ఏడి - 54 ఏడి) తన ఆధీనంలో ఉన్న భిన్న వర్గ ప్రజల పట్ల ఎలాంటి చర్యలు తీసుకున్నాడో 5వ పుస్తకంలో వివరిస్తాడు. సుటోనియస్ 25.4లో ఇలా రాశాడు. "క్రీస్తు పురికొల్పడం వల్ల ఎల్లప్పుడు గందరగోళాన్ని సృష్టిస్తున్న యూదుల్ని రోమా పట్టణంలోనుండి క్లాడియస్ చక్రవర్తి వెలివేశాడు".

ఇదే సంఘటన ప్రస్తావిస్తూ అకుల, ప్రిస్కిల్లాల గూర్చి లూకా ఇలా రాశాడు "యూదులందరూ రోమా విడచి వెళ్ళిపోవలెనని క్లౌదియా చక్రవర్తి ఆజ్ఞాపించినందున, వారు ఇటలీనుండి క్రొత్తగా వచ్చినవారు" (అపో.కా. 18:2).

**కొర్నేలియస్ టాసిటస్ (56ఏడి - 120 ఏడి):** గొప్ప రోమా చరిత్రకారుడిగా గుర్తింపు పొందినవాడు. ఈయన అనేక పరిపాలనా సంబంధ పదవుల్ని నిర్వహించాడు. క్రీ.శ. 112-113 కాలంలో ఆసియా ప్రాంతానికి సామంత పాలకుడిగా ఉన్నాడు. క్రీ.శ. 14-68 మధ్య చరిత్రని 16 లేక 18 పుస్తకాలుగా రాశాడు. ఆయన రాసిన ఆఖరి గ్రంథం "ఆనల్స్" (Annals). ఈ గ్రంథంలోని 15వ పుస్తకం 38వ అధ్యాయం నుండి 45 అధ్యాయాలలో క్రీ.శ. 64 తరువాత రోమా పట్టణంలో సంభవించిన గొప్ప అగ్ని

ప్రమాదం గురించి రాస్తూ క్రీస్తు గురించి, క్రైస్తవుల గురించి వ్రాశాడు.

క్రీ.శ. 64లో రోమా పట్టణంలో గొప్ప అగ్ని ప్రమాదం జరిగింది. దానికి 'నీరో' చక్రవర్తే కారణం అన్న వదంతిని ఆపడం కోసం నీరో చక్రవర్తి ఆ నెపాన్ని క్రైస్తవులపైకి నెట్టి వారిని అసాధారణ పద్ధతుల్లో శిక్షించాడని టాసిటస్ 44వ అధ్యాయంలో రాశాడు. ఇక్కడే "క్రైస్తవులు" అన్న పదానికి క్రీస్తే మూలం అని ప్రస్తావించాడు. క్రైస్తవ్యం అనే మూఢనమ్మకం తాత్కాలికంగా అణచివేయబడ్డా, ఈ ప్రాణాంతక నమ్మకం యూదా ప్రాంతంలో ప్రారంభమైనప్పటికీ రోమా పట్టణానికి కూడా చేరింది అని రాశాడు. తిబెరి కైసరు ఏలుబడిలో పొంతు పిలాతు అధికారిగా ఉన్నప్పుడు క్రీస్తుకు మరణ శిక్ష విధించారు అని ప్రస్తావించాడు.

**మరాబర్ సరాపియస్:** ఈయన క్రీ.శ. 73 సంవత్సరంలో సరాపియన్ అనే తన కుమారునికి సిరియన్ భాషలో ఒక ఉత్తరం రాశాడు. ఉత్తర సారాంశాన్ని బట్టి ఈయన స్టోయిక్ తెగకు చెందిన వాడని భావిస్తారు. రోమాతో జరిగిన యుద్ధంలో ఆయన పట్టణాన్ని నాశనం చేసి అతన్ని బంధీగా తీసుకొనిపోయినప్పుడు, అక్కడ నుండి జ్ఞానాన్ని వెంటాడమని జీవితంలోని అనివార్యమైన కష్టాలను తట్టుకోవడానికి జ్ఞానం అవసరం అని చెబుతూ తన కుమారునికి ఈ ఉత్తరాన్ని వ్రాశాడు.

వ్యక్తుల జీవం లోకాన్ని విడచి వెళ్ళిపోవచ్చుగాని జ్ఞానుల కీర్తి, విలువలు నిత్యము నిలిచి ఉంటాయని, జ్ఞానుల్ని అణచివేసినప్పుడు కేవలం వారి జ్ఞానం అంతిమంగా విజయం సాధించడమే కాదు, దేవుడు అణిచివేతదారుల్ని శిక్షిస్తాడు అని రాసే సందర్భంలో, యేసుని యూదుల "జ్ఞానియైన రాజు"గా పరిచయం చేస్తాడు. "రాజు" అనే బిరుదు యేసును విచారించినప్పుడు ప్రాముఖ్యంగా ఆయనకు ఆపాదించిన పదం అన్న విషయం గమనార్హం. యూదా దేశం నాశనం అవ్వడానికి క్రీస్తు మరణానికి సంబంధం ఉంది అని చెప్పడం, క్రీస్తును నిరాకరించడానికి యెరూషలేము నాశనానికి సంబంధం ఉందని సువార్తలలో రాసినదానికి సమాంతరత ఉంది (మత్తయి 23:37-39; 24:2; 27:25; మార్కు 2:12; లూకా 19:42-44; 21:5-6,20-24).

**లూసియన్ (115 ఏడి- 200 ఏడి):** గ్రీకు వ్యంగ్య రచయితగా, సంచార బోధకుడిగా పేరుపొందినవాడు. క్రీ.శ. 165 తరువాత కొద్దికాలానికి రాసిన "పెరిగ్రీనస్ మరణం" అనే పుస్తకంలో రెండవ శతాబ్దానికి చెందిన పెరెగ్రీనస్ జీవితం, మరణాల గురించి వివరిస్తాడు. అతడు తన తండ్రిని చంపిన తరువాత తన పట్టణం నుండి బహిష్కరణకు గురవ్వడం, సమర్థతగల క్రైస్తవుడిగా మారడం అటు తరువాత రాజకీయ విప్లవం కోసం క్రైస్తవ్యాన్ని విడిచిపెట్టడం, అంతిమంగా క్రీ.శ. 165 సంవత్సరం ఒలింపిక్స్ జరిగే ప్రాంతంలో తన జీవితాన్ని అంతం చేసుకోవడం.. ఇలా చాలా సంఘటనలను గ్రంథస్తం చేశాడు.

రెండవ శతాబ్దపు క్రైస్తవ్యం గురించి అనేక విషయాల్లో అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని ఇస్తాడు. క్రైస్తవులు పాలస్తీనా ప్రాంతంలో సిలువపై చనిపోయిన వ్యక్తిని దేవునిగా ఆరాధిస్తారని, వారి ప్రస్తుత జీవితాన్ని ప్రభావితం చేసేటంతగా మరణం తరువాత జీవితం ఉందని దృఢంగా విశ్వసిస్తారని, క్రీస్తు జీవిత నియమాలకు అనుగుణంగా బ్రతుకుతారని, వారికి స్వంత లేఖనాలు ఉన్నాయని వాటిని క్రమం తప్పకుండా చదివి వివరిస్తారని, సహోదర ప్రేమ కలిగి, ఖైదీలుగా ఉన్న తమ తోటి వారిని దర్శించి, సహాయం చేస్తారని.. ఇలా చాలా విషయాలు క్రైస్తవుల గురించి తన రచనల్లో స్పష్టంగా రాశాడు.

**సెల్సస్:** సుమారు క్రీ.శ. 175లో క్రైస్తవ్యంపై దాడి చేస్తూ రాసిన పుస్తకం 'సత్య సిద్ధాతం" (Truth Doctrine). రెండవ శతాబ్దంలో క్రైస్తవ్యానికి వ్యతిరేకంగా యూదులు చేసిన ఆరోపణల్ని ప్రధానంగా ఈ పుస్తకంలో పొందుపరిచాడు. యేసుక్రీస్తు పుట్టుక, బాల్యం, పరిచర్య, మరణం, పునరుత్థానం, కొనసాగుతున్న ఆయన ప్రభావంలాంటి విషయాలపై విస్తృతమైన దాడి సెల్సస్ చేశాడు. ఈయన ప్రధానమైన దాడి తాత్వికపరమైనదే గాని చరిత్రకు సంబంధించినది కాదు. యేసు చారిత్రకతను ఇతడు ప్రశ్నించలేదు.

**ఫ్లావియస్ జోసఫ్ (39 ఏడి-100 ఏడి):** ఈయన యూదా చరిత్రకారుడు. "జూయిష్ వార్, యాంటిక్విటీస్" ఈయన రచనల్లో ప్రాముఖ్యమైనవి. బాప్తీస్మమిచ్చు యోహాను గురించి, యేసుక్రీస్తు సహోదరుడైన యాకోబు గురించి, క్రీస్తు గురించి తన రచనల్లో ప్రస్తావించాడు. యాంటి 20:9.1-200లో క్రీస్తు గురించి సంక్షిప్తంగా ప్రస్తావిస్తాడు. యేసుక్రీస్తును

గురించి ప్రధానంగా ప్రస్తావించిన భాగం యాంటీ 18:3.3–63/64.

"ఆయనను మనిషి అని పిలవడం సమంజసమైతే, సుమారు ఇదే సమయంలో "యేసు" అనే జ్ఞానం గల వ్యక్తి జీవించాడు. ఎందుకంటే ఆయన అద్భుత కార్యాలను చేశాడు. సత్యాన్ని సంతోషంగా అంగీకరించే వారికి బోధకుడు. ఆయన చాలామంది యూదుల్ని, గ్రీకుల్ని గెలుచుకున్నాడు. ఆయనే మెస్సయ్య. మన మధ్యనున్న ప్రముఖ వ్యక్తులు ఆయన మీద ఆరోపణలు చేయగా విన్న పిలాతు ఆయనకు సిలువ శిక్ష విధించాడు. ఆయనను మొదట ప్రేమించిన వారు దానిని మానలేదు. ఎందుకంటే మూడవ దినాన సజీవుడిగా వారికి మళ్ళీ కనిపించాడు. దైవ ప్రవక్తలు ఆయన గురించి ఈ విషయాలు మరియు అనేక ఇతర విషయాలు ప్రవచించారు. ఆయన పేరు కలిగిన క్రైస్తవ్యం ఈ నాటికీ అంతం కాలేదు".

జోసిఫస్ రాసిన ఈ భాగం యొక్క చారిత్రక ప్రామాణికతపై వాదోపవాదాలు ఉన్నాయి. అయితే అత్యంత, ఖచ్చితమైన, తటస్థమైన, స్వతంత్ర, క్రైస్తవేతర ప్రాచీన సాక్ష్యం ఏంటంటే: "పట్టువిడవకుండా నిరంతరం ఆయనను వెంబడించేవారు. "క్రీస్తు" అని పిలిచే యేసు జ్ఞానం గల వ్యక్తి".

యేసుక్రీస్తు గురించి స్వతంత్ర క్రైస్తవేతర ప్రాచీన సాక్ష్యాలు ఉన్నప్పటికీ, ఆయన గురించి ఎక్కువ సమాచారం అందుబాటులో లేకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి.

1. యేసుక్రీస్తు సమకాలీకులైన లేక ఆయన చనిపోయిన తర్వాత 85 సంవత్సరాలలోపు జీవించిన రోమా చరిత్రకారుల రచనలన్నీ సంపూర్ణంగా నాశనం అయిపోయాయి.
2. ప్రాచీనకాలంలో చరిత్రకారులు వారి సమకాలీన చరిత్ర కంటే కూడా వారికి పూర్వం జరిగిన సంఘటనల గురించి రాయడానికే మొగ్గుచూపేవారు.
3. క్రైస్తవ్యం రోమా సామ్రాజ్యానికి ప్రమాదకరమని భావించినప్పుడు మాత్రమే దాన్ని ప్రాముఖ్యతగల అంశంగా రోమా రచయితలు ఎంచినట్లు అనిపిస్తుంది.
4. ఇతర మత శాఖల చారిత్రక మూలాల గురించి ప్రాముఖ్యంగా "మూఢనమ్మకాల గురించి" రోమీయులకు అతి తక్కువ శ్రద్ధ ఉండేది. మూఢనమ్మకంగా భావించిన క్రైస్తవ్యం గురించి రోమీయుల రచనల్లో తక్కువ ప్రాధాన్యత ఉండడం ఊహించదగినదే.

సువార్తలకు అతీతంగా క్రైస్తవేతరులు, క్రైస్తవ వ్యతిరేకులు రాసిన ప్రాచీన రచనల నుండి యేసుక్రీస్తు జీవితానికి సంబంధించిన చాలా సత్యాలను తెలిసికొనవచ్చును.


1. తిబెరి కైసరు కాలంలో యేసు జీవించాడు.
2. ఆయన విలువలతో కూడిన జీవితాన్ని జీవించాడు.
3. ఆయన అద్భుతాలు చేశాడు.
4. ఆయనకు యాకోబు అనే సహోదరుడు ఉన్నాడు.
5. ఆయన తాను మెస్సయ్య అని చెప్పుకున్నాడు.
6. పొంతుపిలాతు అధికారం క్రింద ఆయనను సిలువపై చంపారు.
7. యూదులు పస్కాపండుగ సమయంలో ఆయనను సిలువ వేశారు.
8. ఆయన చనిపోయినప్పుడు చీకటి, భూకంపం కలిగాయి.
9. ఆయన శిష్యులు ఆయన మృతులలోనుండి తిరిగి లేచాడని దృఢంగా విశ్వసించారు.
10. ఆయన శిష్యులు వారి విశ్వాసం కోసం చనిపోవడానికి సహితం సిద్ధపడ్డారు.
11. క్రైస్తవ్యం రోమా పట్టణం వరకు చాలా వేగంగా వ్యాపించింది.
12. ఆయన శిష్యులు ఆయనను దేవునిగా ఆరాధించారు, రోమా దేవతలను పూజించడాన్ని తిరస్కరించారు.

ఈ సత్యాలన్నీ సువార్తలలో ఉన్న యేసుక్రీస్తు జీవిత చరిత్రలోని ప్రధాన ఘట్టాలకు సాదృశ్యంగా ఉన్నాయి, ఇవి సువార్తల చారిత్రక విశ్వసనీయతను ఇనుమడింపచేస్తున్నాయి.

– **డి. అనిల్ కుమార్,** వైజాగ్

**Reference Books:**

1. Jesus Outside the New Testament - Robert E. Van Voorst
2. The historical Jesus - Gary Habermas
3. The Jesus Legend - Greg Boyd and Paul Eddy



# దైవమానవుడైన క్రీస్తు

యేసుక్రీస్తు దైవమానవునిగా ఈ లోకానికి రక్షణను తీసుకొని వచ్చిన శుభదినమే క్రిస్మస్. ఈ సందర్భంగా ఆయన దైవమానవత్వం గూర్చి సిద్ధాంతపరంగా తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో మనకు ఉంది. ఎందుకంటే ఆయన వ్యక్తిత్వాన్ని గూర్చి న తప్పుడు సిద్ధాంతాలు కొన్ని ఉన్నాయి. ఇవి ఆయన వ్యక్తిత్వం గూర్చిన అవగాహనలోపం ద్వారా ఏర్పడిన తప్పుడు అభిప్రాయాలు. యేసుక్రీస్తు వ్యక్తిత్వంలో దైవ మానవ స్వభావాలు ఏకమై ఉన్నాయి. ఇమిడి ఉండటం కాదు, మిశ్రమై ఉండడం కాదు గానీ ఏకమై ఉన్నాయి. ఈ దైవమానవునిలోని దేవ, మానవ స్వభావాలు ఏక కాలములోనే ఏకమైన మర్మాన్ని అర్థం చేసుకోవడంలో ఉండే సంక్లిష్టతను బట్టి బేధాభిప్రాయాలు మరియు తప్పుడు నమ్మకాలు, బోధలు ఏర్పడ్డాయి.

యేసుక్రీస్తు వ్యక్తిత్వంలో ఏకమై ఉన్న దైవ మానవ స్వభావాలు గూర్చిన విషయాన్ని హైపోస్టాటిక్ - యూనియన్ అంటారు. అభౌతిక, భౌతిక ఏకత్వంను హైపోస్టాటిక్ యూనియన్ అనవచ్చు. ఇది ఒక మర్మము.

## మొదటి శతాబ్దంలో...

యేసుక్రీస్తు దైవమానవత్వాన్ని అర్థం చేసుకోవడంలో మొట్టమొదటి శతాబ్దంలోనే తప్పుడు సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. యేసుక్రీస్తు శరీరధారి కాదు ఆయన ఆత్మ అనే సిద్ధాంతాన్ని అపోస్తలుడైన యోహాను తన పత్రికలో ఖండిస్తూ వచ్చాడు. యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని ఏ ఆత్మ యేసును ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది. ఏ ఆత్మ ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదని రాశాడు (1 యోహాను 4:2)

## సంఘ చరిత్రలో

సంఘ చరిత్రలో మొట్టమొదటిసారి యేసుక్రీస్తు దైవ మానవ స్వభావాల యధార్థత, పరిపూర్ణత స్థాపించబడిన తరువాత (నైసియా కౌన్సిల్,ఎడి 325, కాన్‌స్టాంటైన్ నోపుల్, ఎడి 381) ఆ రెండు స్వభావాల మధ్య గల సంబంధం గూర్చి ఆలోచించడం జరిగింది. ఆయన పరిపూర్ణ మానవుడు మరియు పరిపూర్ణ దేవుడు ఒకేసారి ఎలా అవుతాడో గ్రహించలేక ఆ మర్మాన్ని వివరించడానికి చేసిన ప్రయత్నంలో వచ్చిన కొన్ని తప్పుడు సిద్ధాంతాలను సంఘం తిరస్కరించింది. అవి కింద ఇవ్వబడ్డాయి.

### 1. అపొల్లొనేరియనిజం

అపొల్లొనేరిస్ క్రీశ 361లో లవొదికయకు బిషప్ అయ్యాడు. ఆయన యేసుకు శరీరం ఉంది, ఆయనకు మానవ మనసు, మానవ ఆత్మ లేదు. ఆయనకున్న మనసు, ఆత్మ పైనుంచి వచ్చింది. అది దేవుని త్రిత్వంలో కుమారునిదని బోధించాడు. ఈ బోధను ఆదిమ సంఘం తిరస్కరించింది. దేవుడిచ్చే రక్షణ కేవలం మన శరీరానికి మాత్రమే కాదు, మన

మనసు, ఆత్మ కూడా విమోచించబడాలి అని వారు గ్రహించి ఈ బోధను తిరస్కరించారు. మనము రక్షించబడాలంటే క్రీస్తు పరిపూర్ణమైన మానవుడు మరియు దేవుడు అవ్వాలి (హెబ్రీ 2:17). క్రీశ 362 నుండి క్రీశ 381లలో జరిగిన అన్ని కౌన్సిల్స్ ఈ తప్పుడు బోధను తిరస్కరించాయి.

### 2. నెస్టోరియనిజం

ఈ సిద్ధాంతం ఐదవ శతాబ్దానికి సంబంధించినది. అంతియొకయలోని ప్రముఖ ప్రసంగీకుడు, కాన్స్టాంట్‌నోపుల్ సంఘ బిషప్ అయిన నెస్టోరియన్ ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈయన అభిప్రాయం ప్రకారం, దేవునికి తల్లి ఉండదు. భూమి మీద సృష్టించబడ్డ ఏ జీవి కూడా త్రిత్వంలో ఒకరైన యేసును ఉత్పత్తి చేయలేదు. కాబట్టి మరియ దేవునిని కనలేదు. దేవుడు ఆమెను ఒక సాధనంగా వాడుకొన్నందున ఒక మానవుని మాత్రమే కన్నది అని చెప్పాడు. ఆ తర్వాత నెస్టోరియన్ దైవమానవ స్వభావాల ఏకత్వాన్ని ఒప్పుకొన్నప్పటికీ ఏకత్వం (యూనియన్) కంటే కలయికను (కన్‌జెన్‌షన్) ఎంచుకొన్నాడు. ఉద్దేశపూర్వకంగా ఈ భావన ఎంచుకొననప్పటికీ ఇది యేసుని దైవ, మానవ అని ఇద్దరు వ్యక్తులుగా చీలిక తీసుకొనిరావడం వల్ల తప్పుడు బోధగా పరిగణించబడి క్రీశ 431లో ఎఫెసీలో జరిగిన సంఘ కౌన్సిల్ చేత తిరస్కరించబడింది.

### 3. యూటికీయనిజం

యూటికస్ (375-454 క్రీశ) ఈ సిద్ధాంతాన్ని బోధించాడు. యేసు పుట్టిన తర్వాత ఆయన ఒకే స్వభావాన్ని కలిగివున్నాడని ప్రకటించాడు. అదేంటంటే దేవుడు మానవుడుగా మారిపోయాడని, ఆయన దైవ, మానవ స్వభావాలు లేఖన విరుద్ధమని ప్రకటించి యేసు కన్యకకు జన్మించాడనే విషయాన్ని సమర్థించాడు. ఆయన బోధలోని వివాదం, యేసు నరావతారానికి ముందు రెండు స్వభావాలు కలిగి ఉన్నాడని చెబుతూ, జన్మకు ముందు దేవుడుగా, జన్మించిన తరువాత మానవుడుగా ఉన్నాడని చెప్పి ఆయన గందరగోళానికి గురయ్యాడు.

ఈయన అభిప్రాయాలతో ఒక ఉద్యమం ఏర్పడి యేసు మానవత్వం దైవత్వంలోనికి శోషించబడి అది పూర్తిగా శూన్యమయిపోయిందని బోధించింది. యూటికీయనిజం డొసిటిజం యొక్క ఒక రూపంగా చెప్పవచ్చు. డొసిటిజం అంటే యేసుకు సహజమైన లేక వాస్తవమైన దేహం లేదు ఆయన మానవుడుగా కనిపించాడు అంతే.

యేసు మానవత్వం, దైవత్వం కలసిపోయి మరొక మిశ్రమ వ్యక్తిత్వం (హైబ్రిడ్ సబ్‌స్టాన్స్) కలిగి ఉన్నాడనే బోధను ఈయన విశ్వసించాడు. ఇది కూడా తిరస్కరించబడింది.

యేసు దైవ మానవ ఏకత్వాన్ని పరిష్కరించడానికి మరో రెండు ప్రయత్నాలు జరిగాయి. వాటిలో మొదటిది అడాప్టిజమ్, రెండవది కెనోటిజం.

### 1. అడాప్టిజమ్ (దత్త స్వీకారం)

నజరేయుడైన యేసు తొలినాళ్ళలో కేవలం మానవుడుగా ఉన్నాడు. యేసు బాప్తీస్మము పొందినపుడు దేవుడు ఆయనను కుమారునిగా దత్తత చేసుకొన్నాడు. ఈ అభిప్రాయం మానవుడు దేవుడు అవ్వడం అనే వివాదానికి దారితీస్తుంది. దత్తత సిద్ధాంతాన్ని నమ్మేవారు యోహాను 3:16 వాక్యభాగాన్ని మద్దతుగా ఉపయోగిస్తారు (ఆయన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు అనే భావాన్ని మద్దతుగా ఉపయోగించుకొంటారు). బైబిల్ మొత్తం అవగాహనతో ఈ అభిప్రాయాన్ని పోల్చినప్పుడు ఇది తప్పని మనకు తెలుస్తుంది. సృష్టికి ముందే ఉన్న యేసుక్రీస్తు ఉనికిని, ఈ అభిప్రాయం వ్యతిరేకిస్తుంది. అంతేకాకుండా పరిశుద్ధాత్మ వలన యేసు కన్య మరియకు జన్మించాడనే సత్యానికి విరుద్ధంగా మాట్లాడుతుంది. మన రాష్ట్రంలో ఒక ప్రముఖ బోధకుడు ఈ సిద్ధాంతాన్ని నమ్మి ముస్లిం బోధకుల ముందు ఆయన దైవత్వాన్ని కించపరిచాడు.

### 2. కెనోటిజం (రిక్తుడుగా చేసుకోవడం) ఫిలిప్పీ 2:7

త్రిత్వంలో ఉన్న రెండవ వ్యక్తియైన యేసు దైవ లక్షణాలైన సర్వశక్తిని, సర్వవ్యాపి, సర్వజ్ఞానం ప్రక్కకు పెట్టేసి మానవ లక్షణాలను తీసుకొన్నాడు. దాని ఫలితం ఆయన నరావతారం వద్ద ఆయన దైవస్వభావం కొంత మార్పు చెందింది. ఆయన నైతిక లక్షణాలైన ప్రేమ, నీతి, న్యాయం, కనికరము అలాగే ఉన్నాయి. కెనోటిజం యేసు ఒకేసారి దేవుడు మానవుడు కాదు అని విశ్వసిస్తుంది. కానీ

వరుసగా దేవుడు మానవుడు అని నమ్ముతుంది. కొన్ని లక్షణాలను బట్టి ఆయన దేవుడు, తరువాత మానవుడు ఆపై దేవుడు. ఈ అభిప్రాయం కొన్ని విషయాలను పరిష్కరించడంలో సఫలమవుతుంది గాని బైబిల్ రచయితలు రాసినట్లు ఆయన ఒకేసారి దేవుడు, మరియు మానవుడు అన్న విషయానికి విరుద్ధంగా ఉంటుంది.

### యేసుక్రీస్తును గూర్చి నాలుగు తప్పుడు బోధలు

1. ఎబియోనిజం: యేసు దేవుడు కాదు
2. ఏరియనిజం: యేసు పూర్తిగా దేవుడు కాదు కొంచెం తక్కువ.
3. డోసిటిజం: యేసు మానవుడు కాదు. మానవుడుగా కనిపించాడు అంతే.
4. అపొల్లోనేరియనిజం: యేసు పూర్తిగా మానవుడుకాదు.

### ఒక వ్యక్తిత్వం రెండు స్వభావాలను గూర్చి తప్పుడుబోధ

1. నెస్టోనేరియనిజం: యేసు ఇద్దరు భిన్నమైన వ్యక్తుల మిశ్రమం
2. యూటికీయనిజం: యేసు రెండు స్వభావాల సమ్మిళితం లేక మిశ్రమం

### బైబిల్ ఏమి బోధిస్తుంది?

యేసు నరావతారిగా రావడం అంటే దైవత్వం విడిచిపెట్టడం లేక కోల్పోవడం కాదు గానీ మానవత్వాన్ని ఆపాదించుకోవడం. ఇదే విషయం మనకు రెండుచోట్ల బైబిల్‌లో స్పష్టంగా రాయబడింది.

1. కొలస్సీ 2:9: దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది.

2. హెబ్రీ 10:5: బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నాకొక శరీరమును అమర్చితివి.

యేసు నరావతారిగా వచ్చినప్పుడు దేవత్వమును విడిచిపెట్టలేదు గాని నరావతారిగా ఉన్న కాలానికి ఆయన విధి నిర్వహణలో భాగంగా తండ్రికి లోబడ్డాడు. యేసు విధి నిర్వహణ మన కోసం ప్రాయశ్చిత్తం చేయడం.


యేసు బాల్యం నుండి నేను మెస్సీయను తండ్రి పని మీద వచ్చాను అనే స్పృహ కలిగి ఉన్నాడు. యెరూషలేములో తప్పిపోయినప్పుడు, వారి తల్లిదండ్రులు ప్రశ్నించినప్పుడు నేను నా తండ్రి పనుల మీద నేను ఉండాలి కదా అని చెప్పాడు. చాలాసార్లు నేను పరలోకం నుండి వచ్చాను అని పరలోకంకు వెళతాను (తండ్రి దగ్గరకు) అని చెప్పడం దీనిని సమర్థిస్తుంది.

ఆయనకు మానవ స్పృహ కూడా ఉంది. చాలాసార్లు తనను తాను మనుష్యకుమారునిగా పరిచయం చేసుకొన్నాడు. తనను తాను దేవుని కుమారునిగా, మనుష్యకుమారునిగా బాల్యం నుండే భావించాడు. కాలక్రమేణా వచ్చిన స్పృహకాదిది. అయితే యేసు తన్ను తాను ప్రత్యక్ష పరచుకోవడం లేక బయలు పరచుకోవడం కాలక్రమేణ జరిగిందంతే. దీనికి ఆయన జీవితంలో జరిగిన రెండు ప్రాముఖ్యమైన విషయాలను గమనించవచ్చు. ఒకటి కొండమీద రూపాంతరం చెందడం, రెండవది, పేతురు వచ్చి నీవు సజీవుడవైన దేవుని కుమారుడవు అని చెప్పడం. తర్వాత మనుష్యకుమారుడు చనిపోయి, మూడవ దినాన లేవవలసి ఉందని మరణ, పునరుత్థానాన్ని, మిషన్‌ను బయలుపరచుకొన్నాడు.

యేసు తన తండ్రితో ఏకమై ఉన్నాడని, తాను మెస్సయ్య, దేవుని కుమారుడు, ప్రభువు, మనుష్య కుమారుడు అని బయలుపరచుకోవడం ఆయన మూలాన్ని, ఉనికిని, అస్థిత్వాన్ని, స్పృహను తెలియజేస్తాయి.

యేసు నరావతారిగా మారినప్పుడు ఆయన దైవలక్షణాలు ఏమీ పోగొట్టుకోలేదు గానీ తనంతట తాను పరిమితులు విధించుకొని వాటిని మరుగు చేసుకొన్నాడు. దైవలక్షణాలు ఆయనకు ఉండి మరలా పోయేవి లేక కోల్పోయేవి కాదు. తిరిగి మరలా వచ్చేవి కావు. యేసుక్రీస్తుకు రెండు చిత్తాలు, రెండు స్పృహలు, రెండు స్వభావాలు (దైవ,మానవ) ఉన్నాయి. అయితే ఈ రెండు స్వభావాలు ఒకే వ్యక్తిత్వంలో ఏకమై ఉన్నాయి. ఆయన మానవచిత్తం ఎల్లప్పుడూ తండ్రికి లోబడుతూ పరిశుద్ధాత్మ చేత నడిపించబడుతూ ఉన్నది.

యేసుక్రీస్తు స్వభావంపై ఏర్పడిన తప్పుడు సిద్ధాంతాలను తిప్పి కొట్టడానికి ఏడి 451లో కాల్సిడోనియన్ కౌన్సిల్ కానిస్టాంట్‌నోపిల్‌లో (నేటి ఇస్తాంబుల్) థియలాజియన్స్ ఒక డిక్లరేషన్ ప్రతిపాదించారు. ఇది అపొల్లోనేరియనిజమ్, నెస్టోరియనిజమ్, యూటికీయనిజమ్ మొదలైన తప్పుడు సిద్ధాంతాలను ఖండించింది. ఈ డిక్లరేషన్ అన్ని




సంఘాలకు (కేథలిక్, ప్రొటస్టంట్స్, ఆర్థోడాక్స్) ప్రామాణికంగా ఎంచబడుతుంది. యేసు నూటికి నూరుపాళ్ళు దేవుడు మరియు మానవుడు, తండ్రితో సమానుడు. ఆయనలో రెండు స్వభావాలు ఏకమై ఉన్నాయి. ఆ స్వభావాలు విడదీయలేనివి మారనివి. ప్రతి స్వభావం యొక్క లక్షణాలు ఎప్పటికీ అలానే ఉంటాయి. అలాగే యేసు తండ్రితో త్రిత్వములో ఏకమై ఉంటూ తాను ధరించుకొన్న మానవ స్వభావాన్ని ఎన్నటికీ కొనసాగిస్తాడు.

## యేసు ఎన్నటికీ తన మానవ స్వభావాన్ని కొనసాగిస్తాడు

యేసు పునరుత్థానుడైన తర్వాత తన మానవ స్వభావాన్ని వదలిపెట్టలేదు, దానిని ఆయన కొనసాగించాడు. ఆయన తన గాయాలను శిష్యులకు చూపించాడు. వారు చేప ముక్కను ఇచ్చినప్పుడు దానిని తిన్నాడు. దూతలు ఈ యేసే తిరిగి వస్తాడని శిష్యులకు చెప్పారు. స్తెఫను హింసించబడుతున్నప్పుడు మనుష్యకుమారుడు నిలువబడి ఉండడం చూశాడు. సౌలుతో నేను నీవు హింసించుచున్న యేసును అని పరిచయం చేసుకొన్నాడు. అపోస్తలుడైన యోహాను ప్రకటన గ్రంథంలో మనుష్యకుమారుని పోలిన ఒకనిని చూశాడు (యోహాను 20:26-27, లూకా 24:41-42). యేసు శిష్యులకు కనిపించినప్పుడు నాకు ఉన్నట్లు యెముకలు, మాంసము భూతానికి ఉండవని చెప్పాడు. కాబట్టి యేసు నిరంతరం దైవమానవునిగా పరలోకంలో కొనసాగుతాడు. ఆయన త్రిత్వంలోనికి మహిమపరచబడ్డ మానవత్వాన్ని తీసుకొనిపోయాడు. ఇది పతనమైన మానవత్వం కాదు గాని పతనానికి ముందు ఆదాము, హవ్వలకు ఉన్న మానవత్వం.

## ముగింపు

యేసు నరావతారం మన పాపప్రాయశ్చిత్తం కోసమే (హెబ్రీ 2:14-17). యేసు తండ్రిని పరిచయం చేయడానికి, పరలోకంను గూర్చి పాపుల పట్ల దేవుని ప్రేమను తెలియజేయ డానికి, తండ్రి మిషన్ (యోహాను17) నెరవేర్చడానికి వచ్చాడు. కాబట్టి మనం కూడా ఈ మిషన్‌లో పాల్గొనాలి. పశ్చాత్తాపము ద్వారా, రక్షణ పొంది ప్రజలు నిత్యరాజ్యంలో ప్రవేశిస్తారు కాబట్టి సువార్త ప్రకటించాలి.

నిత్యమైన వాక్యంగా ఉన్న యేసు శరీరధారియై మరణాన్ని చవిచూశాడు. ఆయన మానవత్వంలో పాలుపంచుకోవడం ద్వారా మన సహోదరుడు అయ్యాడు. అందువల్ల జీవితకాలం మరణభయం నుండి మనలను విడిపించడానికి, సాతాను క్రియలు లయం చేయడానికి, మనకు విమోచన అనుగ్రహించడానికి మన పాపాల కోసం బలి అవ్వడమే కాకుండా మనలను నీతిమంతులనుగా తీర్చి, మహిమపరచడానికి ఆయన నరావతారం మనకు సహాయం చేసింది. ఆయన మనలాంటి శోధనల గుండా, శ్రమల గుండా వెళ్ళాడు కాబట్టి మనలను అర్థం చేసుకోగలడు, సహాయపడగలడు.

ఆయన రాజుగా వచ్చి పరలోక రాజ్యమును గూర్చి ప్రకటించాడు. క్రొత్తగా జన్మిస్తేనే తప్ప ఆయన రాజ్యంలోకి ఎవరూ ప్రవేశించలేరు. కాబట్టి, ఆయన రాజ్య సువార్తను ప్రకటించాలి, ఆయన రాజ్య విస్తరణకు పాటుపడాలి, పనిచేయాలి, శ్రమను హింసను భరించాలి. క్రీస్తు సువార్త వల్ల కలిగే పశ్చాత్తాపం, మారుమనస్సు ద్వారానే ఆయన రాజ్యం నిర్మితమవుతుంది. ఈ క్రిస్మస్ పర్వదినాల్లో సువార్త ప్రకటించడం ద్వారా ఆయన రాజ్య విస్తరణకు పాటుపడడానికి ప్రతిష్టించుకొందాం, రెండవ రాకడకు సిద్ధపడదాం.

**- జి. జెర్మియా ప్రసాద్,** తుని
ఏపి-ఇఐయఫ్ స్టాఫ్

**Reference:**

1. Christian Theology - Millard J Erickson
2. Integrative Theology - Gordon R. Lewis, Bruce A. Demarest
3. Systematic Theology - Wayne Grudem



ప్రత్యేకం

# కరోనా కాలంలో క్రిస్మస్ సందేశం

హాస్పటల్ ప్రాంగణమంతా కరోనా పేషెంట్స్‌తో కిక్కిరిసింది. ఇంకా పేషెంట్స్ రోజూ వస్తున్నా హాస్పటల్ ఖాళీ అవ్వడం లేదు.

ఆ హాస్పటల్ మేనేజర్‌గా ఉన్న లోకేష్‌కి తళుక్కున ఓ ఆలోచన వచ్చింది. చాలామంది యౌవన పేషెంట్స్ వస్తున్నారు గానీ బెడ్స్ లేవు. వృద్ధ పేషెంట్స్ త్వరగా చనిపోతే ఇంకా ఎంతోకాలం బ్రతకాల్సిన యువ పేషెంట్స్ బతుకుతారనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా తనకన్నా పెద్దగా ఆలోచించే సూపరింటెండెంట్ అట్లర్‌కు తన ఆలోచన పంచుకున్నాడు.

అట్లర్‌కి ఆ ఆలోచన అస్సలు నచ్చలేదు. కరోనాని నిర్మూలించాలంటే ఇలా యూత్ మీద జాలిపడి వృద్ధులను చంపాలనుకోవడం తప్పు అన్నాడు. లోకేష్ సూపరింటెండెంట్ గారి మంచితనాన్ని మనసులో మెచ్చుకుంటుండగా అట్లర్ బాంబు పేల్చాడు.

కరోనాను నిర్మూలించాలంటే చిన్నా, పెద్దా తేడా లేకుండా కరోనా పేషెంట్లనందరినీ మట్టుపెడితే పీడ విరగడవుతుంది అన్నాడు.

మీ ఇద్దరి ఆలోచనలు భయంకరమైన తప్పుడు ఆలోచనలు అంటూ వారి సంభాషణ వింటూ అప్పుడే హాల్లోకి వచ్చిన డాక్టర్ జస్టిన్ అన్నారు.

చూడు లోకేష్... నీ సూత్రం అందరికీ వర్తిస్తే పోయిన సంవత్సరం కరోనా నుండి కోలుకున్న మీ నాన్న ఈపాటికే కడతేరిపోయేవారు అన్నాడు. మౌనంగా తల దించుకున్నాడు లోకేష్.

అట్లర్, నీవు చెప్పినట్లే గనుక కరోనా వచ్చిన వారందరినీ చంపితే దాదాపు ఈ లోకంలో నాతో సహా ఎవ్వరూ బ్రతికి ఉండరు. లోకంలో ప్రతి సమస్యకు పరిష్కారం ఉన్నట్లే మీ ప్రశ్నలకు సమాధానం ఉంది.

లోకేష్, అట్లర్‌లు ఇద్దరూ ఆశ్చర్యంగా చూస్తుంటే.. తన సెల్‌ఫోన్‌లో ఉన్న క్రిస్మస్ సందేశం విన్పించాడు డా॥ జస్టిన్. కరోనాకి, క్రిస్మస్‌కి సంబంధమేంటా అని ఆశ్చర్యపోతూ విన్నారు.

క్రిస్మస్ అంటే క్రీస్తు ఆరాధన. మనలను కరోనా కన్నా మరణాంతకమైన పాపపు వైరస్ నుండి రక్షించడానికి దేవుడును, రక్షకుడైన యేసుప్రభువు ఈ లోకానికి వచ్చారు. పాపం అనే వైరస్ అత్యంత క్రూరమైనది, ప్రమాదకరమైనది. అది మనిషిని నిత్యనరకాగ్నికి తీసుకొని వెళ్తుంది. అయితే యేసుప్రభువు ఆ పాపం నుండి మనలను రక్షించడానికి ఈ లోకానికి వచ్చారు.

“తన ప్రజలను వారి పాపాల నుండి ఆయనే రక్షించును” ఆయన మనలను ఎల్లప్పుడు తన స్వంత ప్రజలుగా చూస్తాడు. అంతేగాని వృద్ధులని, పిల్లలని, అన్యమతస్తులని వేరుగా చూడడం, చిన్నచూపు చూడడంలాంటి తారతమ్యాలు లేవు. ఆయన దృష్టిలో ప్రతి ఒక్కరూ విలువైనవారే. ఈ విషయాలు చెబుతున్నప్పుడు లోకేష్‌కు జ్ఞానోదయమైంది.

ఈ భయంకరమైన పాపమనే వైరస్ నుండి ఆయన మనలను, మానవజాతిని రక్షించడానికి ఈ లోకంలో జన్మించినప్పుడు పరలోక దూత ఆ వార్తను శుభవార్తగా అభివర్ణించింది.

"అయితే ఆ దూత – భయపడకుడి, ఇదిగో ప్రజలందరికిని కలగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు!

ఎంత సంతోషం! ఇప్పుడు మానవాళి నిస్సహాయంగా, నిరీక్షణ లేకుండా పాపంలోనే చనిపోనక్కరలేదు. సాక్ష్యాత్తూ ఆ దేవుడే మనిషిని రక్షించడానికి మానవజన్మలో పుట్టాడు. అందుకే క్రిస్మస్ మహా సంతోషకరమైన రోజు. మనిషి మనుగడకు ఆధారం, పున:ప్రారంభం. ఆయన ఈలోకంలో అద్భుతంగా బోధించి పవిత్రంగా జీవించారు. ప్రవచనాల ప్రకారం కారణజన్ముడు. పాపక్షమాపణిచ్చే అధికారం ఆయనకే ఉంది. ఆయన త్యాగపూరిత మరణం, మరణాన్ని జయించి పునరుత్థానుడవ్వడం ఆయన ప్రత్యేకతల్లో మచ్చుకు కొన్ని మాత్రమే. ఇంకా ఎన్నో ఉన్నాయి. అద్భుతాలు చేసే శక్తి, సృష్టిపై అధికారం గలవాడు. ఆయన మనలను ఎంతో ప్రేమించి, తన ప్రాణాన్ని సహితం లెక్కజేయక మన కోసం బలిగా అర్పించారు.

"అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను". (రోమా 5:8).

దేవుడు మనలను ఎంతగా ప్రేమించారంటే పాపంతో ఉన్న మనలను చంపాలని, మనం చావాలని ఆయన కోరుకోలేదు గానీ మనలోనున్న పాపమనే వైరస్ ప్రభావాన్ని, పూర్తిగా నాశనం చేయడం కోసం ఆయనే త్యాగపూరితంగా మనకు బదులు మరణించారు. దీనిలో ప్రేమయున్నది.

ఆ మాటలు విన్న లోకేష్, అట్లర్ తమ పొరపాటును గ్రహించారు. చావాల్సింది రోగి కాదు వైరస్. అలాగే చావాల్సింది పాపి కాదు పాపం అని క్రిస్మస్ సందేశం ద్వారా వాక్యం విన్న ఇరువురికీ అర్థం అయ్యింది.

ఇద్దరూ కన్నీళ్ళతో క్రీస్తుప్రభువు సన్నిధిలో పశ్చాత్తాపంతో దేవుని నమ్మి మోకాళ్ళు వేసి ప్రార్థన చేసి మారుమనస్సు పొందారు. యేసుప్రభుని దేవునిగా, రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించారు. అంటే యేసుప్రభువుని నిజమైన ఒక్కడైన దేవునిగా, పాపమనే వైరస్‌తో జీవిస్తూ నిత్యనరకానికి/మరణానికి వెళ్ళాల్సిన తమను మరణం నుంచి విడిపించిన రక్షకునిగా వారికి అర్థమైంది. ఆయనవలె జీవించడానికి, ప్రభువుగా ఆయన అధికారం క్రిందికి రావడానికి ఇష్టపడ్డారు.

యేసయ్యా మమ్మల్ని రక్షించినందుకు వందనాలు, ఇక నుండి ఎవ్వరి మరణాన్ని కోరుకోము గాని, ఇక ప్రతి రోజూ మా ప్రాణాన్ని అడ్డుపెట్టి ఇతరులకు వారు వృద్ధులైనా యౌవనులైనా సువార్తను చెప్పి రక్షణలోకి నడిపిస్తాం అని అట్లర్, లోకేష్‌లు దేవుని సన్నిధిలో సమర్పించుకున్నారు. వీరి రక్షణానుభవాన్ని చూసి జస్టిన్ చాలా మురిసిపోయాడు....

– **దాసరి రాజేష్,** హైదరాబాద్


**విద్యార్థి జ్వాల**


సౌవార్తీక విద్యార్థి మాసపత్రిక -కాలానికి
అనుగుణంగా కలం కదలికలు
ఇది మనది, మనందరిది, ధర తక్కువ...
దీవెన ఎక్కువ...
చదవండి, చదివించండి, చందాదారులు
అయ్యేటట్లు ప్రోత్సహించండి.

**చందా వివరాలు**

| | |
|---|---|
| విద్యార్థులకు (1 సం॥కు) | 120/- |
| గ్రాడ్యుయేట్స్‌కు (1 సం॥కు) | 250/- |
| విద్యార్థులకు (3 సం॥లకు) | 300/- |
| గ్రాడ్యుయేట్స్‌కు (3 సం॥లకు) | 650/- |
| జీవిత సభ్యత్వం (15సం॥) | 2000/- |

**సబ్‌స్క్రైబ్ చేసుకోవడం చాలా సులువు**

1. విద్యార్థిజ్వాల అకౌంట్‌కు మనీ పంపించండి.
   VIDYARTHI JWALA ACCOUNT NO:
   **SBI - 36698741798 IFS Code: SBIN0011994,**
   **uesiap vj, Nambur Branch**
2. <https://bit.ly/SubscriptionForVJ> ఈ లింక్‌లో మీ వివరాలు నింపండి.



ప్రత్యేకం

# పాత నిబంధన కేంద్రం క్రీస్తే

2022 సంవత్సరాల క్రిందట వచ్చిన యేసుక్రీస్తు ఎలా దేవుడవుతాడు అన్నది చాలామంది అవిశ్వాసుల ప్రశ్న. సంఘం వెలుపల ఉన్న వ్యక్తులు ఇలా ఆలోచించడం, అవగాహన లేమివల్ల అడగటం సహజం. సంఘంలోని వ్యక్తులు కూడా క్రీస్తుప్రభువు శరీరధారిగా రాకమునుపే ఆయన ఉనికి కలిగి ఉన్నాడన్న విషయం అవగాహన లేకపోవడం ఆశ్చర్యం. మరి కొంతమంది యేసుప్రభువు కేవలం నూతన నిబంధనలోనే ఉన్నాడనుకోవడం, పాత నిబంధన కేవలం యెహోవా దేవుని గురించిన పుస్తకం అని అనుకోవడం గొప్ప ఆశ్చర్యం. అయితే దేవుని వాక్యాన్ని మనం శ్రద్ధగా చదివితే పాత నిబంధన మూలరాయి, పునాది, కేంద్రం క్రీస్తే అని అర్థమవుతుంది. పూలదండలో దారం కనిపించకపోయినప్పటికీ పూలన్నిటికీ ఆధారమై, వాటన్నిటిని ఎలా పట్టి ఉంచుతుందో అదే రీతిగా యేసుక్రీస్తు అనే దారం చుట్టూ అల్లబడిన వృత్తాంతాల సారాంశమే పాత నిబంధన.

యేసుక్రీస్తు ప్రభువే స్వయంగా పాత నిబంధన సారాంశం, భావం నేనే అని లూకా 24: 27 ,44 వచనాలలో చెప్పాడు. పాత నిబంధన భక్తులు ఎదురుచూసింది తనకోసమేనని లుకా10:24 లో చెప్పాడు. రోమా1:4లో పాత నిబంధన వాగ్దానం క్రీస్తు మరియు సువార్త అని, రోమా 16:25లో పాత నిబంధనలో మరుగై ఉన్న మర్మము, రహస్యము క్రీస్తే అని ఉంది. పాత నిబంధనలో యెహోవా దూతగా, షాలేము రాజైన మెల్కీసెదెకుగా ప్రత్యక్షమయ్యాడు.

ఈ వ్యాసంలో పాతనిబంధనలో యేసుక్రీస్తు ఉనికిని, గుర్తులను, పనిని పరిశీలిద్దాం.

### 1. సృష్టి- క్రీస్తు

సృష్టియావత్తు ఆయన చేతిపనే. "ఆకాశమందున్నవియు భూమియందున్నవియు, దృశ్యమైనవిగాని, అదృశ్యమైనవిగాని, అవి సింహాసనములైనను ప్రభుత్వములైనను ప్రధానులైనను అధికారములైనను, సర్వమును ఆయనయందు సృజింపబడెను, సర్వమును ఆయన ద్వారాను ఆయననుబట్టియు సృజింపబడెను"( కొలస్సీ 1: 16). సృష్టి చేయడంలో త్రియేక దేవునిగా ఆయన పనిచేయడం మనం చూస్తాం. త్రియేక దేవుడిగా మనల్ని తన స్వరూపంలో చేసుకోవడం(ఆది1:26), సృష్టిని, ప్రజలను పరిపాలించడం, నియంత్రించడం చూస్తాం (ఆది11:7). సృష్టికి అతీతుడుగా, ఆయన నిత్యుడుగా, నిరంతరం స్వయం ఉనికి కలిగివున్నాడు. (యెషయా 9: 6).

### 2. ప్రవచనాలు- క్రీస్తు

బైబిల్ స్కాలర్స్ ప్రకారం దాదాపు 500 ప్రవచనాలు యేసుక్రీస్తు గురించి ముందుగానే పాత నిబంధనలో చెప్పబడ్డాయి. దీనిని బట్టి పాత నిబంధన ఎదురుచూసిన, నిరీక్షణ క్రీస్తే. ఆయన ఏదో కొత్తగా వచ్చిన వ్యక్తి కాదు, పాత నిబంధనలో ప్రవచింపబడిన దైవ మానవుడు.

"ఏలయనగా మనకు శిశువు పుట్టెను మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన

భుజముమీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధానకర్తయగు అధిపతి అని అతనికి పేరు పెట్టబడును" (యెషయా 9:6)థ. ఇలా ప్రవచనానుసారమే క్రీస్తు. ప్రవక్తలందరూ రాబోతున్న నిజ ప్రవక్త అయిన క్రీస్తు ప్రభువుకు సూచనే (ద్వితీ 18:18, లూకా7:16, 24:19).

## 3. నిబంధనలు- క్రీస్తు

ప్రతి నిబంధన ఒక సంబంధానికి ఆధారం. ఆ సంబంధానికి సంబంధించిన షరతులు, వాగ్దానాలు నెరవేరకపోతే పరిణామాలు ముందుగానే చెప్పబడతాయి. దేవుడు నోవహుతో,అబ్రహాముతో, దావీదుతో నిబంధన చేశాడు. సీనాయి పర్వతం మీద ఇశ్రాయేలీయుల ప్రజలతో నిబంధన చేశాడు. పాత నిబంధనలో చాలాసార్లు ప్రజలు నిబంధనను మీరి ప్రవర్తించినా ఆయన మాత్రం నిబంధన వాగ్దానాలు నెరవేరుస్తూ వచ్చాడు. ఈ నిబంధనలన్నీ రాబోతున్న కొత్త, అంతిమ నిబంధనకు సూచనగా ఉన్నాయి. (యిర్మీయా 31:31-34, లూకా22:14-23, హెబ్రీ 9:15)

## 4. బలులు- క్రీస్తు

పాత నిబంధనలో దేవుడు జంతు బలుల ద్వారా ప్రాయశ్చిత్తాన్ని ఏర్పాటు చేశాడు. యాజకుడు ప్రజల పాపాన్ని పశువుపై ఆపాదించేవాడు. ప్రజల ప్రాయశ్చిత్తం నిమిత్తం పశువుని అర్పణగా అర్పించి దాని రక్తంతో ప్రజలకు ప్రాయశ్చిత్తం చేస్తాడు. ఈ విధి విధానాలు యేసుక్రీస్తు ప్రభువులో నెరవేరాయి. ఆయన ప్రజల పాపాలు మోసుకొని పోయే గొర్రె పిల్లగా, ప్రజల పాపాల నిమిత్తం అర్పించబడిన పశువుగా చేయబడ్డాడు (హెబ్రీ9:11). దహనబలి, సమాధానబలి, పాపపరిహారార్థ బలి, అపరాధపరి హారార్థబలులు క్రీస్తుప్రభువు యొక్క బలిని చూపిస్తు న్నాయి. బలి పశువు యొక్క రక్తం క్రీస్తుప్రభువు యొక్క రక్తాన్ని ఒక సూచనగా చూపిస్తుంది (ఎఫెసీ 5:2, 1 పేతురు 1:19).

## 5. యాజకులు- క్రీస్తు

లేవీయకాండంలో యాజకుల పాత్రను మనం గమనిస్తాం. వారు ప్రజల పాపాల నిమిత్తం ప్రాయశ్చిత్తం చేయడం వారి విధి. ప్రధాన యాజకుడు పశువుల రక్తాన్ని తీసుకొని ప్రజల నిమిత్తం, తన నిమిత్తం కూడా ప్రాయశ్చిత్తం చేస్తాడు. అయితే యేసుక్రీస్తు తన కొరకు అర్పించుకోవాల్సిన అవసరం లేని గొప్ప, నిరంతర ప్రధాన యాజకుడై తన స్వరక్తం చేత ప్రాయశ్చిత్తం చేశాడు. పాత నిబంధనలోని యాజకత్వం క్రీస్తు ప్రభు యొక్క యాజకత్వాన్ని చూపిస్తుంది.(హెబ్రీ 5:6,7:26,9:11).

## 6. మధ్యవర్తులు- క్రీస్తు

పాత నిబంధన గ్రంథంలో దేవునికి ప్రజలకి మధ్యవర్తిత్వం చేసిన వ్యక్తుల్ని మనం గమనిస్తాం. మోషే, యెహోషువ, న్యాయాధిపతులు, ప్రవక్తలు వీరందరూ దేవునికి ప్రజలకు మధ్య మధ్యవర్తులు గా ఉండి దేవుని మాటలు దేవుని ఉద్దేశాలు ప్రజలకు తెలియజేశారు, ప్రజల పక్షాన దేవునికి ప్రార్థన చేశారు. వీరందరూ రాబోతున్న నిజమైన మధ్యవర్తి అయిన యేసుక్రీస్తును సూచనగా ఉన్నారు (1 తిమోతి2:5, హెబ్రీ 9:15).

## 7. రాజులు- క్రీస్తు

ఇశ్రాయేలీయులను పరిపాలించిన అనేక రాజుల ను మనం చూస్తాం. అయితే వారందరూ ఒకానొక రోజు రాబోతున్న నిత్యరాజైన యేసుక్రీస్తుని, ఆయన రాజ్యాన్ని చూపిస్తున్నారు. 2సమూయేలు 7: 16 లో దేవుడు "నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అనెను". దేవుడు దావీదుతో వాగ్దాన నిబంధన చేసినట్లుగా, దావీదు సంతానంలో నుంచి యూదుల రాజుగా, ప్రపంచ రారాజుగా యేసు క్రీస్తు రావడం జరిగింది.(ప్రకటన 17:14,19:16)

## 8. ఆశీర్వాదాలు- క్రీస్తు

దేవుడు పాత నిబంధనలో ఆయా సందర్భాలలో ఇశ్రాయేలు ప్రజల్ని భౌతికంగా ఆశీర్వదించడం చూస్తాం. ఇంకా అన్యులను, రాజులను, వ్యక్తులను కుటుంబాలను దేవుడు భౌతికంగా ఆశీర్వదించడం మనం చూస్తాం. ఇవన్నీ జరగబోతున్న యేసుక్రీస్తు సిలువలో ఉన్న ఆధ్యాత్మిక ఆశీర్వాదాలను చూపిస్తు న్నాయి. పాత నిబంధన భక్తుల జీవితాల్లోని భౌతిక ఆశీర్వాదాలు అన్నీ క్రీస్తు సిలువ ద్వారా అందే ఆధ్యాత్మిక ఆశీర్వాదాలు, నిత్య ఆశీర్వాదాలు సూచిస్తున్నాయి.

## 9. శాపాలు- క్రీస్తు

పాత నిబంధనలో మనం అనేకమైన శాపాలు, శిక్షలు, తెగుళ్ల చూస్తాం. ఆయా సందర్భాలలో

దేవుడు తన ఉగ్రతను, శిక్షను అవిధేయులైన ప్రజల మీద చూపించాడు. దేవుడు వాళ్ల పనులను బట్టి తీర్పు తీర్చాడు. ఇవి సిలుమరణం తర్వాత దేవుడు చేసే అంతిమ తీర్పుకు గుర్తు. నిత్య నరకం, నిత్య శిక్షకు గుర్తులై ఉన్నాయి. యేసుక్రీస్తు ప్రభువు యొక్క త్యాగపూరితపు సిలువ మరణాన్ని కాదన్నవారికి, ఎగతాళి చేసిన వారికి రాబోవు దేవుని ఉగ్రత నిత్య శిక్షను చూపిస్తున్నాయి.

## 10. పాత నిబంధన భక్తులు- క్రీస్తు

పాత నిబంధనలోని పరిశుద్ధులైన భక్తులందరూ కేవలం యేసు క్రీస్తును బట్టి మాత్రమే దేవుని సన్నిధిలో అంగీకరించబడ్డారు. రక్షణ యేసుక్రీస్తు మూలంగానే ఇప్పటికీ, అప్పటికీ కూడా. పాత నిబంధనలోని భక్తులు వాళ్ళ భక్తి జీవితాన్ని బట్టి, నీతి క్రియలను బట్టి, పరిశుద్ధతను బట్టి దేవుని సన్నిధిలో అంగీకరించబడలేదు. దేవుడు వాళ్లందరినీ యేసుక్రీస్తు ప్రభువులో చూశాడు. అబ్రహాము, యోసేపు, దానియేలు, దావీదు, ఏలియా, ఎలీషా సమూయేలు ఇలా అందరూ వాళ్ళ జీవితాల్లో బలహీనతలు కలిగిన వాళ్ళే అయినప్పటికీ వాళ్లు క్రీస్తు ప్రభువును బట్టి అంగీకరించబడ్డారు. వాళ్ల అచంచల విశ్వాసాన్ని బట్టి, పరిశుద్ధతను బట్టి కాదు గానీ దేవుడు జరగబోతున్న యేసు క్రీస్తు సిలువ, సిలువలో ఉన్న ఆశీర్వాదాలు అన్నీ వాళ్లకు లెక్కించాడు. రోమా4:1-8లో ధర్మశాస్త్రానికి ముందు ఉన్న అబ్రాహాము, ధర్మశాస్త్రం క్రింద ఉన్న దావీదు స్వనీతి, ధర్మశాస్త్ర క్రియలను బట్టి కాక దేవునియందలి విశ్వాసాన్ని బట్టి, రాబోతున్న క్రీస్తు సిలువను బట్టి నీతిమంతులుగా తీర్చబడ్డారు, దేవుని సన్నిధిలో అంగీకరించబడ్డారని వాళ్ళ అనుభవాన్ని పౌలు ప్రస్తావించాడు.

## ముగింపు


"పాత కొత్త నిబంధనల కథాంశం యొక్క విషయం, ప్రధాన ఆకర్షణ, కేంద్రం, గొప్ప శీర్షిక, మరియు ముగింపు కూడా క్రీస్తే" అని అలెక్ మోటైర్ అనే ప్రఖ్యాత బైబిల్ స్కాలర్ అంటాడు. నిబంధనలకు మాత్రమే కాదు ప్రపంచ చరిత్రకి కేంద్రం ఆయనే. విశ్వాసి వ్యక్తిగత, కుటుంబ జీవితానికి కేంద్రం క్రీస్తే! మరి నీ జీవితానికి కేంద్రం క్రీస్తేనా?

– ఏ. శివరామకృష్ణ, స్టాఫ్, పిడుగురాళ్ళ

# Crossword Puzzle




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*




**Horizontal**

1. The place shepherds saw Mary, Joseph & Baby
5. Fourth Son of Cush, Father of Sheba, Dedan
7. A devout says 'I have seen your salvation'
9. An eloquent poet, second and greatest of Israel's kings
10. A Kohathite, son of Shemaiah

**Vertical**

2. Son of Antipater, friend of Augustus, Agrippa
3. Father of Canaan, youngest son of Noah
4. Roman Governor who sinned against conscience
6. First Missionary, one of the 12 apostles
8. Son of Zohan, a Hittite (also name of a mountain)

**Last month key:**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| A | C | Q | U | I | L | A |
| E | B | | E | R | | N |
| D | E | I | B | R | I | D |
| E | L | I | E | Z | E | R |
| R | A | M | R | A | M | E |
| P | H | I | L | I | P | W |

*1. M. Ankarao, Guntur*
*2. T. Anand Babu & Koteswari, Chilakaluripet*
*3. R. Suma Srinivas, Staff, Guntur*
*4. T. Anna Mani, Gudivada*

# ఈ తరం... మన తరం






'తమ్ముడు, గుడీవినింగ్ ఎలా ఉన్నావు' అంటూ అటువైపు నుండి ఫోన్‌లో రాజేష్ అన్న అడుగుతున్నాడు. ఇటువైపు శ్రీకాంత్ ఏదో పరధ్యానంలో ఉండి, 'పర్లేదు అన్నా, బాగానే ఉన్నా' అన్నాడు.

"అవునా! సరే, ఏదో ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్‌కి బైబిల్ స్టడీ తీసుకొంటున్నాను అన్నావు, ఎలా జరుగుతుంది" అని అడిగే సరికి, వైఫైకి పాస్‌వర్డ్ కనెక్ట్ అవ్వకపోతే వచ్చే చిరాకు కంటే ఎక్కువ చిరాకుతో శ్రీకాంత్..

"ఏంటో అన్న, ఈ స్టూడెంట్స్ అర్థం కావట్లేదు. ఎవరూ సరిగా బైబిల్ స్టడీకి రావడం లేదు. చాలా చిరాకుగా, ఇబ్బందిగా ఉంది బైబిల్ స్టడీకి వెళ్ళడానికి" అని అన్నాడు.

ఇంతలో అటువైపు నుండి రాజేష్ అన్న మాట్లాడబోయే లోపు ఎక్స్‌ప్రెస్‌లా శ్రీకాంత్ మాట్లాడుతూ... "అన్న, ఏంటి ఈ స్టూడెంట్స్! మాట వినరు, పిలిస్తే పలకరు, రమ్మంటే రారు, కూర్చోమంటే కూర్చోరు, మనసు విప్పి మాట్లాడరు, నోరు తెరిచి అడగరు.. నాకైతే బొత్తిగా బుర్ర పని చేయడం లేదు. ఒక్కొక్కసారి ఒళ్ళు మండినంత పని అవుతుంది. వాళ్ళ డ్రెస్‌లు, జుట్టు, గడ్డాలు, చిరిగిపోయిన బట్టలు, వాళ్ళు వాళ్ళ అవతారం.. ఛ... ఛ... ఏమిటి, వీళ్ళు ఇలా ఉన్నారు అన్పిస్తుంది. ఎంత చెప్పినా, ఎంత మొతుకొన్నా ఆ సెల్‌ఫోన్ వదిలిపెట్టరే, అందులోనే మునిగితేలుతున్నారు... అన్నిటిని మరచిపోయి దానితోనే తలమునకలు అవుతున్నారు. అన్నా! నీట్‌గా గడ్డం గీసుకొని, చక్కగా క్రాఫ్ దువ్వుకొని, మంచి బట్టలు వేసుకొన్న అబ్బాయి కన్పిస్తే దండేసి దండం పెట్టాలన్పిస్తుంది. అమ్మాయిల సంగతి సరేసరి... మనం మాట్లాడుకోలేము".

అంతలో.. అటువైపు నుండి రాజేష్ అన్న చాలా సహనంతో విని ఏదో చెప్పబోతుంటే.. వెంటనే శ్రీకాంత్..

"అన్న, మొన్న బస్సులో వెళ్తుంటే నా వెనుక కాలేజ్ స్టూడెంట్స్ మాట్లాడుకొంటున్నారు, ఒరేయ్, ఒసేయ్, ఏంటిరా, ఏంటే... అబ్బో చెప్పలేనులే... ఏం మాటలు అవి... ఎంత దారుణంగా మాట్లాడుకొంటున్నారు. అన్నా, ఈ తరం పిల్లలకి మనం పరిచర్య చేయలేము, వారిని దేవుని కోసం నిలబెట్టలేము. ప్చ్.. ఏమీ చెయ్యలేము. మన వల్ల కాదు అన్పిస్తుంది. మేము స్టూడెంట్స్‌గా ఉన్న రోజులలో ఎంత చక్కగా వచ్చేవాళ్ళం, ఎంత దూరం నడిచి వచ్చేవాళ్ళం. ఎంత బుద్ధిగా వినేవాళ్ళం, ఎంత పరిచర్య చేశాం... అంటూ శ్రీకాంత్ చెప్పబోతుంటే, అటువైపు నుండి రాజేష్ అన్న కొంచెం అసహనంగానే తమ్ముడూ, కొంచెంసేపు ఆపుతావా? అంటూ అడిగేసరికి... వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కి గేదె అడ్డు వచ్చినంత పని అయ్యినట్లు శ్రీకాంత్ సడన్‌గా మాటలు ఆపేశాడు.

అంతలో రాజేష్ అన్న, తమ్ముడూ వచ్చే ఆదివారం కుదరితే మా ఇంటికి వచ్చేయ్, మనం కలసి మాట్లాడుకొందాము అని చెప్పి, ఉంటాను తమ్ముడు అంటూ ఫోన్ పెట్టేశాడు.

అయ్యో! అన్నను ఏమైనా ఇబ్బందిపెట్టానా? నా మాటలతో విసిగించానా? అని అనుకొంటూ సరేలే ఇంటికి వెళ్ళినప్పుడు సారీ చెప్తానులే అనుకొంటూ బైబిల్ స్టడీ తీసుకోవటానికి సిద్ధపడి, ఆటో కోసం రోడ్డు మీదికి వచ్చేశాడు శ్రీకాంత్.

ఆదివారం రానే వచ్చింది.

శ్రీకాంత్ వీలు చూసుకొని రాజేష్ అన్న ఇంటికి వెళ్ళాడు. ఇంటికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కేసరికి, రాజేష్ అన్న రానే వచ్చాడు, సాదరంగా ఆహ్వానించాడు, అక్క చిరునవ్వుతో పలకరించి, వేడి వేడి పకోడిలు, టీ ఇచ్చి వెళ్ళింది. పిల్లలు లోపల పడుకొన్నట్లున్నారు. ఇల్లు చాలా నిశ్శబ్దంగా ఉంది.

కొంతసేపటికి

'తమ్ముడూ, చెప్పు ఏంటి సంగతులు అని రాజేష్ అన్న అడిగేసరికి.. వెంటనే శ్రీకాంత్ 'అన్న, సారీ.. మొన్న ఫోన్‌లో మీకు కొంచెం విసుగు తెప్పించినట్లు ఉన్నాను' అని అన్నాడు.

"ఓ... అదేమి లేదులే, నీవు చాలా చిరాకుతో, కోపంతో ఈ కాలం స్టూడెంట్స్‌పై విరుచుకుపడుతుంటే కొంచెం బాధ అన్పించింది. మా రోజుల్లో అయితే, మేము ఎలా ఉన్నాము అంటూ నీవు చెబుతుంటే ఇంకొంచెం బాధ అన్పించి ఫోన్ పెట్టేశాను. మీ రోజులలోలాగా, మీకు లాగా ఉండాలనుకోవడం మన మొదటి తప్పుడు అభిప్రాయం. ప్రతి తరం ప్రత్యేకమైన వారే. ఒక తరాన్ని మరో తరంతో పోల్చ కూడదు. ఎందుకంటే అన్ని విషయాల్లో మార్పులు వస్తున్నాయి. గనుక ఈ తరం విద్యార్థులను అర్థం చేసుకొంటూ వారికి సువార్తను ప్రకటించి, వారిని ప్రభువులో స్థిరపరచాలంటే ముందుగా వాళ్ళ ట్రెండ్స్, వాళ్ళ టెంపర్మెంట్స్ (స్వభావం, మైండ్ సెట్స్) తెలుసుకోవాలి". ఈ తరం ట్రెండ్స్ ఎలా ఉన్నాయో నీకు చెప్తాను.

1. బట్టలు ఎంత ఎక్కువగా చిరిగితే, అంత గొప్ప
2. ఒళ్ళు ఎంత కన్పిస్తే అంత ఫ్యాషన్
3. ఎంత ఎక్కువ రఫ్ లుక్, అయితే అంత క్రేజ్
4. ఒక చేతిలో స్మార్ట్ ఫోన్, ఒక చేతిలో స్మార్ట్ గర్ల్/ స్మార్ట్ బాయ్ చెయ్యి.
5. ఎవరు చెప్పినా వినరు (మనసు వినదు, చెవి వినదు).. చెవిలో ఇయర్ ఫోన్స్
6. సోషల్ మీడియా లేకపోతే నిమిషం గడవదు, అడుగు పడదు, ముద్ద నోట్లో దిగదు.
7. ఓటిటి ప్లాట్‌ఫామ్స్ కాలం, వెబ్ సిరీస్‌ల మయం, క్రైమ్, థ్రిల్లర్, సస్పెన్స్, రొమాన్స్ మూవీల హవా సాగుతున్న రోజులు.
8. ఎంటర్‌టైన్‌మెంట్, రియాల్టీషో, డేర్ అండ్ ట్రూత్ గేమ్స్.
9. అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి ఒకే రూమ్‌లో ఉండటం.
10. అమ్మాయిల అవసరాలు అబ్బాయిలు తీర్చడం, అబ్బాయిల అవసరాలు అమ్మాయిలు తీర్చడం.

ఇలా చెప్పుకొంటూపోతే.. ఇంకా చాలా ఉన్నాయి.

ఈతరం విద్యార్థుల ట్రెండ్స్‌తోపాటు వారి మైండ్‌సెట్ ఎలా ఉంది అనేది కూడా మనం ఆలోచించాలి.. టాప్ 10 మైండ్‌సెట్స్ ఆఫ్ ఇండియన్ యూత్ అని ఒక సర్వే ఇచ్చిన విషయాలు.. వారి మనస్తత్వం యొక్క సంగతులు.

1. అందరిలో బాగా కన్పించాలి, ఉన్నతంగా జీవించాలి. ఇప్పుడు ఎవరి నోట విన్నా ఎంత ప్యాకేజి జాబ్ అనే అంటున్నారు.
2. అందరికి ఎప్పుడూ కొత్తగా కన్పించాలి, అన్ని విషయాలలో బెటర్ వర్షన్స్ కావాలి. అందుకనే మార్కెట్‌లోకి కొత్త గ్యాడ్జెట్ వస్తే ఖచ్చితంగా కొనాల్సిందే.. అవసరం లేకపోయినా సరే.
3. 'నాకు నేనే' అనే మత్తులో ఉన్నారు. స్వార్థంగా ఆలోచించడం ఎక్కువైంది. 'మనం' లో నుండి 'నాకు' అనే వరకు వచ్చింది.
4. ఎక్కువగా జాతీయవాదాన్ని ఇష్టపడుతున్నారు. ఇండియన్‌గా జీవించు అని.
5. జీవితంలో ఎప్పుడూ సరదా ఉండాలి. చిల్ ఉండాలని కోరుకుంటున్నారు.
6. జీవితంలో ఏదైనా వెంటనే కావాలి, ఇప్పుడే, నో వెయిటింగ్.

7. జీవితం అంత గొప్పగా ఉండాలి, ఏదైనా గొప్పగా ఉండాలి, గొప్పగా చెప్పుకోవాలి, గొప్పగా కన్పించాలి.
8. కొత్తవారితో పరిచయాలు, కొత్తవారితో సంబంధాలు కోరుకొంటున్నారు.
9. టెక్నాలజీని విస్తృతంగా వాడుకోవాలి.
10. సమాచారం ఎక్కువగా తెలుసుకోవాలి. విషయ పరిజ్ఞానం కోసం తపిస్తున్నారు.

పైన చెప్పిన 10 విషయాలు మనకు అర్థమైతే, అప్పుడు వారికి అర్థవంతంగా సువార్త చెప్పగలము. అంతేకాకుండా ప్రస్తుత తరం విద్యార్థుల అవసరాలు కూడా ఆలోచించాలి.

1. **భౌతికముగా:** ధనికంగా, అందంగా, ఆకర్షణీయంగా కన్పించాలి. ఎదుటివారిని అట్రాక్ట్ చేయాలి.
2. **మేధస్సుపరంగా:** గుర్తింపు సమస్యతో ఉన్నారు, నేనెవరిని, నా జీవిత గమ్యం ఏమిటి? అనే ప్రశ్నలతో సతమతమవుతున్నారు.
3. **భావోద్వేగాలపరంగా:** ఓటమి అంగీకరించే వారి కోసం, వారిని వారిగా ఇష్టపడే వారి కోసం, వారి అలవాట్లు, అవతారం ఎలా ఉన్న అంగీకరించే వారి కోసం
4. **సామాజికముగా:** సమాజంలో రోల్‌మోడల్స్ కోసం చూస్తున్నారు.
5. **ఆధ్యాత్మికంగా:** అసంతృప్తి, మరణ భయం... లాంటివి.

తమ్ముడు శ్రీకాంత్, ఇంకా కొన్ని విషయాలు చెప్పాలని ఉంది.. అయితే అందులో అయిదు విషయాలు చెప్తాను. ప్రస్తుత విద్యార్థి లోకం

1. అందమైన ప్రేమ (అక్రమ సంబంధాలు)
2. అత్యాచారాలు (చిన్నపిల్లల మీద కూడా)
3. ఆత్మహత్యలు
4. అశ్లీలత
5. అపవిత్రత (పెళ్ళికి ముందే సెక్స్ తప్పు కాదు)

అనే ఈ 5 విషయాలతో పట్టబడి ఉన్నారు..

ఇప్పుడు చెప్పు తమ్ముడు శ్రీకాంత్, "మీ రోజులకు ఈ రోజులకు ఏమైనా సంబంధం ఉన్నదా?" మనం చూడాల్సిన ధోరణి మారాలి, వాళ్ళ ట్రెండ్స్‌ను, మైండ్ సెట్స్‌ని, అవసరాలను చూడగల్గితే అర్థవంతమైన పరిచర్య చెయ్యగలం. దయచేసి ఇంకెప్పుడు మా రోజులలో, మేమైతే అనే మాటలు వాడకు. ప్రస్తుతంలోకి రావాల్సిందే, ప్రస్తుతపు తరాన్ని అర్థం చేసుకోవాల్సిందే, అంగీకరించాల్సిందే...

ఈ మాటలు వింటూనే, చెంపల మీదుగా కారుతున్న కన్నీళ్ళను శ్రీకాంత్ తుడుచుకోవటం రాజేష్ అన్న గమనించి, మనసులోనే దేవునికి వందనాలు చెప్పుకొన్నాడు.

ఇంతలో లోపలి నుండి అక్క, శ్రీకాంత్ భోజనం చేసి వెళ్ళుదువు.. ఇంట్లో చెప్పు, లేట్ అవుతుంది అని చెప్పేసరికి... ఆ.. సరే అక్క అంటూ ఫోన్ చేసి ఇంట్లో వాళ్ళకి విషయం చెప్పాడు.

కొద్దిసేపటి తర్వాత...

శ్రీకాంత్ మనసు అంతా చాలా భారంగా అన్పిస్తుంది... అంతలో "అన్నా, నేటి తరానికి, అస్తవ్యస్తముగా ఉన్న నేటి విద్యార్థులకు సేవ చేయడానికి నేనేం చెయ్యాలో చెప్పండి" అంటూ చాలా ఆసక్తితో అడిగాడు. అందుకు వెంటనే రాజేష్ అన్న, తమ్ముడు, బైబిల్‌లో కొన్ని విషయాలు మనం ఆలోచన చేద్దాం..

ప్రస్తుతపు ట్రెండ్స్‌ని, మైండ్ సెట్స్‌ని గమనించినప్పుడు మనకు అన్నీ అననుకూలముగానే కన్పిస్తాయి, నిరాశగానే ఉంటుంది, ప్చ్, ఏమీ చెయ్యలేము, చాలా కష్టంలాగానే అన్పిస్తుంది.

మొదట మన దృక్పథం మారాలి. దేవునిని మనం విశ్వసించాలి. తర్వాత దేవుని కార్యం చూడాలి. విశ్వాసంతో పరిచర్య చెయ్యాలి (నిర్గమ 14:13). తర్వాత రిస్క్ తీసుకునేవారు, శ్రద్ధ తీసుకొనేవారు, ప్రార్థన చేసేవారు కావాలి.

పాతనిబంధనను గమనిస్తే...

అవకాశాలు లేనప్పుడు అద్భుతాలు జరిగాయి, అననుకూల పరిస్థితులలోనే గొప్ప పరిచర్య జరిగినట్లు అర్థమవుతుంది. నిర్గమకాండం ప్రారంభంలో ఐగుప్తులో ఇశ్రాయేలీయులు ఉన్న పరిస్థితులలో దేవుడు చేసిన అద్భుతాలను చూస్తాము. అంతా అయిపోయింది, ఇంకా ఏమి లేదు, మనము ఏమి చెయ్యలేము, మన చెయ్యి దాటిపోయింది...

ఇలాంటి మాటలు వినిపిస్తున్న పరిస్థితులలో దేవుడు మోషే ద్వారా ఎంత గొప్ప అద్భుతాన్ని చేశాడో గమనించవచ్చు.

ఆ రోజులలో, ఆ పరిస్థితుల్లో (నిర్గమ 1:14,16). మోషే బతికి బట్ట కట్టాడంటే దేవుని ప్రణాళిక, అంతేకాదు ఆ ప్రణాళిక అమలు కావడానికి దేవుని చేతిలో వాడబడిన వ్యక్తులు.

**రిస్క్ తీసుకొన్నారు:** మోషే తల్లిదండ్రులు (నిర్గమ 1:16,22) అమ్రాము మరియు యోకెబెదు (నిర్గమ 6:20) తమ ప్రాణాలను ఫణంగా పెట్టి, మూడు నెలలు మోషేను దాచిపెట్టారు. మూడు నెలలు బాబును దాచిపెట్టడం అంత ఈజీ కానే కాదు. దాదాపుగా 90 రోజులుగా నిద్రాహారాలు మానుకొని ఉండి ఉంటారు. రిస్క్ తీసుకొన్నారు. "రిస్క్ లేకుండా గొప్ప పరిచర్యను చూడలేము" తమ్ముడు. ఈ రోజులలో ఫోన్‌ల మీద, పేపర్స్ మీద పరిచర్య జరిగిస్తున్నారు. అందుకే అంతంతమాత్రముగా ఉంది.

**శ్రద్ధ తీసుకొన్నవారు:** మోషే అక్క (నిర్గమ 2:4,7,8). జమ్ము పెట్టెలో పెట్టబడిన మూడు నెలల బాలుడు సురక్షితమైన స్థలములోనికి వెళ్ళేంతవరకు వెంట ఉంది.

**ప్రార్థన చేసినవారు:** ఇశ్రాయేలు ప్రజలు (నిర్గమ 2:23). వారు పెట్టిన మొర దేవుని యొద్దకు చేరెను.

ప్రార్థన చేసేవారు, శ్రద్ధ చూపేవారు, రిస్క్ తీసుకొనేవారు ఉంటే, అననుకూలంగా, అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులలో కూడా దేవుని అద్భుతాలు చూడగలము.

కొత్త నిబంధనలో గమనించినట్లయితే...

అప్పటి కాలం పరిస్థితులు మనకు తెలుసు. దేవుని ప్రత్యక్షత లేకుండా 400 సం॥లు చీకటి కాలములో ఉన్న ఇశ్రాయేలీయులు మెస్సయ్య కోసం ఎదురుచూస్తున్నారు. అప్పుడు అంతా అననుకూలమే, అస్తవ్యస్తమే ఏమీ చెయ్యలేము, అంతా చీకటి కాలమే. ఎలా? అంటూ నిట్టూర్పులు విన్పిస్తున్న రోజులవి. లోకానికి రక్షకుడిని అందించడానికి....

**మరియమ్మ తల్లి రిస్క్ తీసుకొంది:** ఎంతకి తెగించిందో అని అనుకొని ఉంటారు, మాయని మచ్చగా ఉంటుంది, ప్రధానం చేసుకున్నవాడు, సమాజం, కుటుంబము కూడా 'ఛీ' అంటుందని తెలిసి జీవితం అంతా చిందరవందరగా మారుతుందని ఎరిగి "నీ మాట చొప్పున జరుగును గాక" (లూకా 1:38) అని చాలా వినయంతో తల వంచి, లోక రక్షకుడికి తల్లి అయ్యింది.



**యోసేపు శ్రద్ధ తీసుకొన్నాడు:** తనకు సంగతులన్ని దూత ద్వారా అర్థమైన తర్వాత దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారం, తన భార్యను చేర్చుకొనెను" (మత్తయి 1:24). ప్రభువైన యేసుక్రీస్తు తల్లి గర్భం నుండి బయటకు వచ్చేవరకు మరియను చాలా శ్రద్ధగా పట్టించుకొన్నాడు. తర్వాత రోజులలో కూడా శ్రద్ధను చూపించాడు.

**సుమెయోను, అన్న అను ప్రవక్త్రి ప్రార్థన చేసినవారు:** వీరు చాలా ప్రార్థనాపరులు. ఆ రోజులలో పరిస్థితులకు సరిగా సరిపోయిన వ్యక్తులు మరియు ప్రార్థనాపరులు (లూకా 2:25,36).

చివరిగా, ప్రభువైన యేసుక్రీస్తు కూడా కొందరు వ్యక్తుల గూర్చి రిస్క్ తీసుకొన్నాడు. (సేన దయ్యం పట్టిన వ్యక్తిని రక్షించే సమయంలో మార్కు 4:35-41), సమరయ స్త్రీ విషయంలో, పాపంలో పట్టబడిన స్త్రీ విషయంలో శ్రద్ధ తీసుకోవటం, అనేకమార్లు ప్రార్థన చెయ్యడం మనకు చక్కటి మాదిరి.

"అసాధారణమైన పరిస్థితులలోనే ఫలవంతమైన పరిచర్య జరుగుతుంది". అ.కా. 13:36. దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరము వారికి సేవ చేసి నిద్రించెను.

మనం కూడా ఈ తరానికి సేవ చేయడానికే పిలువబడ్డాము. ఈ తరం.. యువతరం, మన తరానికే సేవ చెయ్యాలి. అయితే, రిస్క్ తీసుకోవాలి, శ్రద్ధ చూపించాలి, ప్రార్థన చెయ్యాలి. ఫోన్ మీద, పేపర్స్ మీద పరిచర్యను నడిపించలేము. కన్నీరు కార్చే కళ్ళు, మండే గుండె.. పరిగెత్తే పాదములతో మాత్రమే పరిచర్య జరిగించగలం.

**- యం. గాలెయ్య,** భీమవరం

# అదే నా జీవితంలో గొప్ప మలుపు



నేను 1974సం॥ డిసెంబర్ 4వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, బత్తిలిలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించాను. 10వ తరగతి వరకు అక్కడే చదివాను. పీయూసీ చదువుతున్న సమయంలో (1992-1994) విజయనగరం కంటోన్మెంట్‌లో ఉంటున్న మా పెద్దన్న ప్రేమానందంతో కలిసి ఉండేవాడిని. మా వదిన, భవాని విజయనగరం ఇజియఫ్ మెంబర్. ఆ సమయంలో, విజయనగరం ఇజియఫ్ సభ్యుడైన కె.సునీల్ కుమార్ అన్న 1992 నవంబర్ 14న సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ స్కూల్‌లో జరిగిన ఇయు గాస్పల్ మీటింగ్‌కు నన్ను ఆహ్వానించాడు. జేయస్‌పి జూలియస్ అన్న తప్పిపోయిన కుమారుని గూర్చి బోధిస్తున్నాడు. నేను మొదటి వరుసలో కూర్చొని మీటింగ్ చివరిలో వెళ్ళబోతుంటే జూలియస్ అన్న నా చేయి పట్టుకొని 5 నిమిషాలు కూర్చోమని రిక్వెస్ట్ చేశాడు. అదే నా జీవితంలో ఒక గొప్ప మలుపు. జూలియస్ అన్న ఆల్టర్‌కాల్ ఇచ్చినప్పుడు నేను నా జీవితాన్ని ప్రభువైన యేసుక్రీస్తుకు అప్పగిం చాను. అప్పటి నుండి నూతన విశ్వాసంలో ఎదుగుతూ సాలిపేటలోని హల్లెలూయ ప్రార్థనా మందిరంలో జరిగే బిబియస్‌కు వెళ్ళేవాడిని. రీజినల్ గ్రాడ్యుయేట్ హెల్పర్‌గా ఉంటూ విజయనగరం వచ్చిన సుందర్‌సింగ్ బాబు అన్నతో పరిచయం ఏర్పడింది. బ్ర.ప్రసాద్, బ్ర. సునీల్ కుమార్‌లు తొలిదినాల్లో నేను ఆత్మీయంగా ఎదగడానికి ఎంతో సహాయం చేశారు. తర్వాత బాబా మెట్టలో ఉన్న రవిబాబు అన్న (ఎల్ఐసి డిఓ) అరుణక్కల ఇంటికి వెళ్ళేవాడిని. ఈ సమయంలో హైదరాబాద్ వర్డ్ అండ్ డీడ్ క్యాంపస్‌లో జరిగే లవ్ క్యాంప్, డిటి, యల్‌టి క్యాంప్‌లకు హాజరయ్యాను.వాటిలో డా.జాన్ పాల్ అన్న, ఎడ్వర్డ్ విలియమ్స్ అన్న స్పీకర్స్‌గా ఉన్నారు.

ఆ తర్వాత 1994-97లో బి.ఏ (తత్వశాస్త్రం) చేయడానికి శ్రీకాకుళం వెళ్ళాను. సుందర్‌సింగ్ బాబు అన్న నిర్మల అక్కకి, ఏవి రాజు అన్నకు పరిచయం చేశాడు. వీళ్ళు నా విశ్వాసాన్ని తోటి విద్యార్థులతో పంచుకోవాలని ఇయు పనిని సమర్థవంతంగా చేయడానికి నన్ను ప్రోత్సహించారు. రీజినల్ గ్రాడ్యుయేట్ హెల్పర్, రీజినల్ కమిటీ సభ్యులు కె.యోహాన్, కె.విజయకుమార్, బి.ప్రసన్న కుమార్, రంగనాథం అన్న వాళ్ళ సహకారంతో ఇయు పనిని పునరుద్ధరించడానికి ప్రభువు నన్ను అక్కడికి తీసుకువెళ్ళాడని తర్వాత నాకు అర్థమైంది. తర్వాత, నేను యంఏ (1997-1999) కోసం హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్శిటీకి వెళ్ళాను. యుజిసి, ఐసిపిఆర్ జేఆర్‌ఫ్ ఫెలోషిప్ పొందిన తర్వాత యంఫిల్ (1999-2000)లో చేరాను. దేవుడు నన్ను క్యాంపస్‌లో పనిని ప్రారంభించేందుకు బలపరిచాడు. నేను పీహెచ్‌డీ చేస్తున్నప్పుడు ఢిల్లీ యూనివర్సిటీ, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ, ఆచార్యనాగార్జున యూనివర్సిటీలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యాను. అయినప్పటికీ, నేను జనవరి 2003సం॥లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో చేరాను. జూలియస్, సుకుమార్ పట్నాయక్, రవిబాబు, సునీల్‌కుమార్ అన్నవాళ్ళ మార్గదర్శకత్వం, ప్రార్థనతో విశాఖపట్నంలోని అప్పర్ రూమ్ ప్రేయర్ ఫెలోషిప్ వ్యవస్థాపకులలో ఒకరి మనవరాలైన రేచల్ ఎడ్విన్‌ను నేను 2008లో వివాహం చేసుకున్నాను. ఇద్దరు కుమారులు ప్రిన్స్ అలెక్స్, డేనియల్ రాజ్‌లతో దేవుడు మమ్మల్ని ఆశీర్వదించాడు. 2015 జనవరిలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017 జనవరిలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందాను.

వివాహానికి ముందు గుంటూరు ఇయు, ఇజియఫ్‌ల్లో, నాగార్జునా యూనివర్శిటీ ఇయులో, వివాహం తర్వాత కుటుంబంగా ఒంగోలు,

విజయవాడ పరిచర్యలో పాల్గొంటున్నాము. ఒక శిష్యుడిగా, రాజీపడని ఆధ్యాత్మిక నాయకుడిగా, సమర్పణ కలిగిన ఇజియఫ్ సభ్యుడిగా మారడానికి నా జీవితంలో దేవుడు అనేకమంది గ్రాడ్యుయేట్స్‌ను ఇచ్చాడు. జేయస్‌ఏ జూలియస్, సునీల్ కుమార్, సుందర్ సింగ్ బాబు, డేవిడ్ రాజ్ కుమార్, జిజె రాయ్, జాన్ పాల్, జోసఫ్ జైసూర్య, మోజెస్ బాబు, డా. సిరాజ్, రంగనాథం, ఎడ్వర్డ్ విలియమ్స్, మెండితోక. సుధాకర్, జాన్ క్రిస్టోఫర్, వైయంజే కుమార్, యం. రవిబాబు, ఏవి రాజు, సుధీర్ అన్నవాళ్ళు నిర్మల అక్క, మధుసూదన్ అన్న, మొదలైన వారందరూ ఆత్మీయ జీవిత ఎదుగుదలకు సహాయంచేశారు. విజయనగరం, శ్రీకాకుళం, హైదరాబాద్, గుంటూరు, ఒంగోలు, విజయవాడ మొ॥ ఇయు, ఇజియఫ్ సహవాసాలు గత 30 సంవత్సరాలుగా (1992-2022) నా ఆత్మీయ జీవిత అభివృద్ధిలో వారు చేసిన కృషికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

నాకిచ్చిన ప్రతి పని, బాధ్యతను దేవుడిచ్చినదిగా భావించి సమాజంలో ఆయనను మహిమపరిచేలా చేశాను. దేవుని సహాయంతో చేయడానికి ఆయన కృపచూపించాడు. దేవుని మార్గంలో నాజీవితం రాజీలేని, వివాదాలు లేని జీవితాన్ని జీవిస్తున్నాను. 2022 సెప్టెంబర్ 5వ తేదీన గౌరవనీయులైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా స్టేట్ అండ్ యూనివర్సిటీ లెవల్‌లో ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డును అందుకున్నాను. ఇది దేవునికృపే, ఆయనకే యుగయుగములకు మహిమ.

## అకడమిక్ ఎక్సలెన్స్

ప్రారంభం నుండి దేవుడు నన్ను అంచెలంచెలుగా హెచ్చించాడు. ప్రారంభంలో ఒంగోలు పిజీ సెంటర్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా, నాగార్జునా యూనివర్శిటీ లైజన్ ఆఫీసర్‌గా, ఏపి ఐసెట్ కోఆర్డినేటర్‌గా, యుజీ ఎగ్జామ్స్ కోఆర్డినేటర్‌గా, యన్‌యస్‌యస్ కోఆర్డినేటర్‌గా, స్టాఫ్ సెలక్షన్ కమిటీ కన్వీనర్‌గా, డిపార్ట్‌మెంట్ హెడ్‌గా రెండు పర్యాయాలు, ఛైర్మన్ ఫర్ ద బోర్డ్ ఆఫ్ స్టడీగా వ్యవహరించడానికి దేవుడు కృపచూపించాడు. ప్రస్తుతం, నేను 2021 నుండి రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్‌గా, పిజీ ఎగ్జామ్స్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నాను. ఇవి కాకుండా



యూనివర్సిటీలో ఇతర అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలను నిర్వహిస్తూ, 2020 నుండి నేటి వరకు ఏపి ఫిలాసఫీ బోర్డ్ ఆఫ్ ది స్టడీ చైర్మన్‌గా నామినేట్ అయ్యాను. ఇంకా నేను యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కోర్ టీమ్‌లో ఉంటూ సపోర్టివ్ స్టాఫ్‌కి, ఫ్యాకల్టీకి సపోర్ట్ చేస్తున్నాను. వివిధ రంగాల్లో దాదాపు 100 కమిటీలను నిర్వహించాను. దీనికి కారణం ఈ అడ్మినిస్ట్రేటివ్ స్కిల్స్, టాలెంట్స్ యుఇయస్‌ఐలోనే నేర్చుకున్నాను. దేవునికే స్తుతి మహిమలు కలుగును గాక!

## అకడమిక్ రికార్డ్స్

నేషనల్, ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో 100 వ్యాసాలను, మూడు పుస్తకాలను ప్రచురించాను. నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో 150 పేపర్స్‌ను సమర్పించాను. నా పర్యవేక్షణలో 30 మంది పిహెచ్‌డి అవార్డులను పొందారు. ఈ 30మందిలో 20మంది విదేశీ స్కాలర్స్, విదార్థులు. ప్రస్తుతం నా దగ్గర 15 మంది సభ్యులు తమ పరిశోధనలు చేస్తున్నారు. నాలుగు దేశాలను సందర్శించాను 5 యుజీసి నేషనల్ సెమినార్స్‌ను, 2 అంతర్జాతీయ సెమినార్స్‌ను నిర్వహించడానికి దేవుడు కృపచూపించాడు.

నా జీవితంలో ప్రారంభ దశనుండే దేవుని అడుగుజాడల్లో నడవాలని నిర్ణయించుకొన్నాను. విద్యార్థులకు, ఇజియఫ్ సభ్యులకు నేనిచ్చే సలహా ఏంటంటే క్వైట్‌టైమ్, పిబియస్ ద్వారా దేవునితో సన్నిహితమైన సహవాసాన్ని కలిగి ఉండండి. దేవుని ఉద్దేశాలు, ప్రణాళికల్ని నెరవేర్చండి. పవిత్ర జీవితాన్ని కొనసాగించండి. దేవునికొరకు ప్రజల్ని గెలవడం కోసం అందుబాటులో ఉండండి. దేవునిని గౌరవిస్తూ, ఆయన మహిమకొరకు పనిచేస్తూ మన పనిని యథార్థతతో చేయండి. అప్పుడు దేవుడు తగిన సమయంలో మిమ్మల్ని హెచ్చిస్తాడు (1 పేతురు 5:6). దేవుని కృప మనందరికీ తోడై ఉండునుగాక.

– ప్రొ.యల్. ఉదయ్ కుమార్, విజయవాడ



# క్రిస్మస్‌కి స్పందన

ఎన్నో క్రిస్మస్‌లు మనజీవితంలో వస్తున్నాయి. మనము ఆనందించే ఆ క్రిస్మస్‌లోని అద్భుతమైన సత్యాన్ని గూర్చి ఎప్పుడైనా ఆలోచించామా? ఆలోచిస్తే దానికి విశ్వాసిగా నీ స్పందన ఏంటి? ప్రభువు జన్మించినప్పటి సంగతులను ధ్యానించినప్పుడు క్రిస్మస్ వెనుక ఎన్ని సంగతులు దాగి వున్నాయో గ్రహించగలము. చరిత్రలో ఇది గొప్ప సంఘటన. దేవుడు మానవునిగా మానవులను దర్శించిన గొప్ప శుభవేళ. మానవుడు చంద్రునిపై నడవడం గొప్పకాదు. సమస్తాన్ని సృష్టించిన మహోన్నతుడైన దేవుడు అతి సామాన్య మానవునిగా ఈ భూమిమీద నడవడం గొప్ప కార్యము. మరి ఈ దివ్యమైన క్రిస్మస్ వెనుక ఉన్న ఆధ్యాత్మిక సత్యాలను ఒకసారి ధ్యానించుదామా!

**1. నిజమైన క్రిస్మస్ - ఆయనను మన జీవితంలో రాజుగా ప్రతిష్ఠించుకోవడం**

మత్తయి 2:2లో జ్ఞానులు "యూదుల రాజుగా పుట్టిన వాడెక్కడ" అని ప్రశ్నించారు. ప్రవక్తలు ఆయన రాజుగా వస్తాడని ప్రవచించారు. మనుష్యులను ఏలునొకడు పుట్టునని దావీదు ప్రవచించాడు. జెకర్యా6:13లో "...అతడు ఘనత వహించుకొని సింహాసనాసీనుడై యేలును...." అని రాయబడింది. జ్ఞానులు ఆ పుట్టిన శిశువును రాజుగా గుర్తించారు. ఆయన నక్షత్రాన్ని వెంబడించి ఎంతో దూరం ప్రయాసతో ప్రయాణించారు. కొంతకాలం ఆయన నక్షత్రము కనబడకపోయినప్పుడు కలత చెందారు. తిరిగి ఆ నక్షత్రము కనబడగానే అత్యానంద భరితులైనారు. ఆ కారణ జన్ముని చూడగానే కలిగిన వారి భక్తిభావాలు వర్ణనాతీతం. సాగిలపడి నమస్కరించారు. వారు తెచ్చిన కానుకలను అర్పించారు. మనల్ని మనం సమర్పించుకోకుండా మనమిచ్చే కానుకలు వ్యర్థం. ఆయన ఆజ్ఞ మేరకు వారు దూత సూచించిన వేరొక మార్గంలో వెళ్ళారు. ఆ రారాజు ఉత్తర్వులకు లోబడ్డారు. మన జీవితంలో క్రీస్తుని ప్రభువుగా ప్రతిష్ఠించుకొన్నప్పుడే విశ్వాస జీవితములోని మాధుర్యం మనకు అర్థమౌతుంది. ఇటువంటి అనుభవం గల వ్యక్తుల జీవితంలో ప్రతిరోజూ క్రిస్మస్సే.

**2. నిజమైన క్రిస్మస్ - ఇవ్వడం**

దేవుడు తన కుమారుని లోకానికి కానుకగా ఇచ్చాడు. కన్య మరియ నింద భరించడానికి సిద్ధపడింది. ఆనందంతో ఈ వెల చెల్లించడానికి ఆమె సిద్ధపడింది. లూకా 1:48 "నా ఆత్మ నా రక్షకుడైన దేవుని యందు ఆనందించెను". యోసేపు మరియను చేర్చుకోవడానికి వెనుకాడలేదు. మత్తయి 1:24 "యోసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను". దేవుని చిత్తం నెరవేర్చడానికి వారిద్దరు తమ్మునుతాము ఇచ్చివేసుకొన్నారు. విధేయత చూపించారు. బెత్లెహేము ప్రయాణంలో, ఐగుప్తు ప్రయాణంలో, ప్రయాసలను ఆనందంతో భరించారు. లోకరక్షకుని ఆగమనానికి తమ జీవిత ద్వారం తెరిచారు.

**3. నిజమైన క్రిస్మస్ - కృతజ్ఞత చెల్లించడం**

క్రిస్మస్‌కి సంబంధించిన సంఘటనలను గమనిస్తే

అందులోని వ్యక్తులందరు దేవుని స్తుతించారు. దూత ద్వారా దేవుని వర్తమానం వినగానే మరియ "నా ప్రాణము ప్రభువును ఘనపరచుచున్నది" అని దేవునిని ఆరాధించినది (లూకా 1:46). లూకా 1:68లో జెకర్యా దేవున్ని స్తుతిస్తున్నాడు. "ప్రభువైన ఇశ్రాయేలు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన తన ప్రజలకు దర్శనమిచ్చి, వారికి విమోచన కలుగజేసెను" అని పాడాడు. ఆకాశాన దూతల సమూహం స్తుతులతో గానప్రతిగానాలు చేశారు. "సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు ఆయనకిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానము కలుగును గాక" అని దేవునిని ఆర్భాటంతో స్తుతించుచూ పాడారు. మరి మన జీవితాలు ఆ స్వచ్ఛమైన స్తుతి ఆరాధనతో నిండి ఉన్నాయా?

### 4. నిజమైన క్రిస్మస్ - సాక్ష్యమివ్వడం

గొర్రెల కాపరులు దూత చెప్పినట్లు "... బెత్లెహేముకు వెళ్ళి మరియను యోసేపును తొట్టిలో పండుకొనియున్న శిశువును చూచి, ఈ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు ప్రచురము చేసిరి...విన్నవారు మిక్కిలి ఆశ్చర్యపడిరి ". గొర్రెల కాపరులు వినిన దానిని, చూచిన దానిని, అనుభవించినదానిని ఇతరులతో పంచుకొన్నారు. బాప్తీస్మమిచ్చే యోహాను - ఆ వెలుగును గూర్చి సాక్ష్యమిచ్చుటకే వచ్చానని (యోహాను 1:8) చెప్పాడు. అనుదినం మన పెదవుల ద్వారా ఆయనను గూర్చి సాక్ష్యమివ్వాలి. ఆశ్చర్యపరచే మన సాక్ష్యం అనేకులను ప్రభావితులను చేయాలి.

### 5. నిజమైన క్రిస్మస్ - మిషన్స్ పట్ల ఆసక్తి కలిగి ఉండడం

ప్రభువైన యేసుక్రీస్తు ఒక మిషనరీగా ఈ లోకానికి వచ్చారు. ఆయన మహిమను వీడి, పరలోకాన్ని వదిలి భూమిపైకి మానవునిగా వచ్చాడు. మనలను దేవునితో సమాధానపరచి - ప్రేమలో, ఆత్మలో నిత్యం మనతో ఉండాలనే తన దయాపూర్వక సంకల్పాన్ని ఆయన నెరవేర్చాడు. మరి నీవు ఆయన సువార్తను అందించడానికి సౌకర్యాలు వదిలి సుఖవలయం నుండి కఠినమైన ప్రదేశాలకు వెళ్ళడానికి ఇష్టపడుతున్నావా? ఏ విధంగా ఈ క్రిస్మస్ చేసుకోదలచావు?

**- యం.యస్.రవికుమార్,** నెల్లూరు

కవిత

## చెంగుచెంగుమంటున్న గొర్రె పిల్ల



తప్పిపోయిన గొర్రెపిల్ల
మారుమనస్సు పొందింది
తను పొందుకొన్న ప్రేమను
ఎదుటివారికి పంచాలని
చెంగు చెంగుమని పరిగెడుతుంది

నవ్వుతూ..
అందరిని పరిచయం చేసుకొంటూ
ఎన్నోసార్లు పడి దెబ్బలు తగిలినా
బాధను దిగమింగుతూ...
తను కలిగి ఉన్న దేవుని గూర్చి చెప్పాలనే
ఆశతో పరిగెడుతూ ఉంది

క్లిష్ట సమయాల్లో గొర్రెపిల్ల ..
బలం తగ్గింది
కళ్ళల్లో కన్నీళ్లు ఉబుకుతున్నాయి
ఎవరు సహాయం చేస్తారో...
తన పని ఎక్కడ ఆగిపోతుందో అని
దిక్కులన్నీ చూస్తూ అటూ ఇటూ తిరుగుతుంది

అయ్యో! ఆ గొర్రెపిల్ల గ్రహించడం లేదే!
తనలో ఉన్నవాడు లోకంలో ఉన్నవానికంటే
గొప్పవాడని
కన్నీరు తుడిచేవాడు, బలమిచ్చే వాడు
ప్రతి సమస్యను పరిష్కరించేవాడు తన కాపరేనని
నమ్మడం లేదే!

ఓ నా ప్రియమైన గొర్రెపిల్లా! చెంగుచెంగు
అని పరిగెడుతూ
లోకంలో ఉన్న వారి సహాయం కొరుకోకుండా...
కాపరి వైపు చూడు
నీ పరుగును ఆపవద్దు సుమీ....!

**- యం. రూప,** ఏయు జోన్, వైజాగ్



# సకల ప్రజలకు – శుభవార్త

ఆదాము – దోషము
వారసత్వంగా – వ్యాపించే
అందరిలో – అవని అంతట
దైవాజ్ఞను – ధిక్కరించి
దేవునికి – దూరమయ్యే
మొదటి – మానవుండు
మనుష్యులందరిలో – మరణఛాయలు
పతనమైన – ప్రధాన దూత
సాతానుడుగా – మారినట్లు
బైబిల్ చరిత్ర – తెలియపరచె
వాడు మానవ జాతిని – చెరపట్టి
నాశనమునకు – నడిపించుచుండె
దేవాది దేవుడు – రక్షణ మార్గమును
ఆలోచించి – అమలుపరచె
కాలము – సంపూర్ణమైనప్పుడు
క్రీస్తు యేసు – లోకమునకు వచ్చె
ఇదిగో... దావీదు పట్టణం
ఇదిగో... తూర్పు దిక్కు నక్షత్రం
ఇదిగో ... భయపడకుడి
నేడు రక్షకుడు
మీ కొరకు పుట్టియున్నాడు
ఇదిగో ... సంతోషించుడి
ఇదిగో... యూదులకు రాజు జన్మించె
ఇదిగో... ఇశ్రాయేలుకు మహిమ
ఇదిగో ... అన్యులకు వెలుగు

సకల ప్రజలకు – సిద్ధపరచిన రక్షణ
ఇది సుమెయోను – సునాద గీతం
ఆదాము దోషమునకు – అడ్డుపడిన రక్షకుడు
ప్రాయశ్చిత్తము – జరిగించిన దైవ కుమారుడు
మానవాళి – మరణానికి నివృత్తి
రెండు వేల – సంవత్సరముల నుండి
ప్రకటించబడుచుండె – రాజ్యసువార్త
సకల ప్రజలారా ... ఆలోచించండి
సకల ప్రజలారా ... నిదానించి యోచించుడి
సృష్టికర్త – సశరీరుడుగా అవతరించె
మృత్యుభీతిన్ – తొలగించున్
ఆత్మశుద్ధి – కలిగించున్
నిజమైన దేవుడు – నరుడుగా జన్మించెనన్న
బైబిల్ వాక్య సత్యాన్ని – నమ్మినవారే ధన్యులు
బెత్లహేము నుండి – 'క్రిస్మస్ ' సవ్వడి
నలుదిక్కుల – వినబడుచున్నది
నక్షత్ర కాంతి – ప్రకాశమానంగా ప్రసరించుచుండె
దూత గణముల గాన ప్రతిగానాలు
ప్రపంచ ప్రజలను మేలుకొలుపుచుండె
ఇదియె – "క్రిస్మస్" అందించె శుభవార్త
సకల ప్రజలకును – శుభవార్త

– **శిఖినం చిన్న ఎలీషా,** నరసరావుపేట

## యేసుక్రీస్తు ఎందుకు రాలేదో తెలుసా?

- తన ఇష్ట ప్రకారం చేయుటకు రాలేదు – యోహాను 5:30
- ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనములనైనను కొట్టివేయుటకు రాలేదు – మత్తయి 5:17
- నీతిమంతులను పిలువరాలేదు – మత్తయి 9:13
- లోకమునకు తీర్పుతీర్చుటకు రాలేదు – యోహాను 12:47
- పరిచారము చేయించుకొనుటకు రాలేదు – మత్తయి 20:28

# క్రీస్తు కోసం మరొక్కరు

*"నీవు నన్ను లోకమునకు పంపిన ప్రకారం నేనును వారిని లోకమునకు పంపితిని" - యోహాను 17:18.*

*"...ప్రభువైన యేసు వలన పొందిన పరిచర్యను తుదముట్టింపవలెనని..." - అపొ.కా 20:24*

నా తండ్రి గ్రామీణ ప్రాంతాలలోని చిన్న చిన్న సంఘాల్లో 50 సం॥లు పరిచర్య చేశారు. ఆయన సామాన్య బోధకుడిగా ఉండి 150 సంఘాలను కట్టి 1999లో ఆయన క్యాన్సర్‌తో చనిపోయారు. తన జీవితంలోని చివరి వారంలో కోమాలోకి వెళ్ళారు. ఒక రోజు రాత్రి దాదాపు చివరి ఘడియల్లో ఒక్కసారిగా చలనం వచ్చి పరుపు దిగడానికి ప్రయత్నిస్తుంటే నా భార్య ఎందుకు అలా చేస్తున్నారు అని అడిగింది. అందుకు ఆయన "క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి! క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి! క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి!" అనే మాట పదేపదే చెప్పాడు. తర్వాత గంటలో ఆయన ఆ మాటను సుమారు వందసార్లు చెప్పాడు.

"క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి!" అని చెబుతూ ఉంటే నా కళ్ళల్లో కన్నీళ్ళు కారుతుంది. నా తండ్రి విశ్వాసాన్ని బట్టి దేవున్ని స్తుతించాను. అదే సమయంలో నా తండ్రి తన బలహీన హస్తాన్ని నా తలపై పెట్టి, ఒక బాధ్యతను అప్పగిస్తున్నట్టు "క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి!" క్రీస్తు కోసం మరొకర్ని రక్షించాలి!" అని చెప్పాడు.

నా శేష జీవితానికి దానిని గురిగా పెట్టుకొన్నాను. మీరు కూడా మీ జీవితానికి దీన్ని కేంద్రబిందువుగా పెట్టుకోవాలని మిమ్ములను ఆహ్వానిస్తున్నాను. ఎందుకంటే నిత్యత్వంలో ఏదీ అంత గొప్ప ప్రత్యేకతను చూపలేదు. మీరు దేవునిచేత వాడబడాలని ఆశిస్తున్నట్లయితే, దేవుడు ఏ విషయంలో శ్రద్ధ కలిగియున్నాడో అదే విషయంలో మీరు కూడా శ్రద్ధకలిగి ఉండాలి; తాను సృష్టించిన ప్రజల విమోచనపైనే ఆయన శ్రద్ధ కలిగి, తప్పిపోయిన తన పిల్లలను కనుగొనాలని ఆశిస్తున్నాడు!

నీ పొరుగింటి వానికి క్యాన్సర్ లేదా ఎయిడ్స్ ఉందనుకో, దానికి మందేమిటో నీకు తెలిసుండి



ఒక జీవితాన్ని కాపాడగల ఆ సమాచారాన్ని నీవు అతనికి తెలుపకపోతే అది నేరమౌతుంది. అలాగే నిత్య నాశనానికి/నరకానికి పాత్రులైన వారికి, క్రీస్తు ద్వారానే నిత్యజీవపు మార్గం అని, యేసు మాత్రమే ప్రజల్ని రక్షించగలడు (అపొ.కా 4:12) అని తెలిసి ఈ సమాచారాన్ని దాచిపెడితే అదెంతో ఘోరమైన విషయం. గనుక మనం ఈ విషయంలో తొందరపడాలి. మరో రోజు కోసం వేచివుండొద్దు.

భూమిపై దేవుడు నీకప్పగించిన పనిని నెరవేర్చడంలో నీవు విఫలమైతే దేవుడు నీకిచ్చిన జీవితాన్ని వ్యర్థం చేస్తున్నట్లు. "దేవుని కృపాసువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుటయందు నా పరుగును, నేను ప్రభువైన యేసువలన పొందిన పరిచర్యను తుదముట్టింపవలెనని..." (అపొ.కా. 20:24) అని పౌలు అంటున్నాడు. నిన్ను బట్టి కనీసం ఒక వ్యక్తి పరలోకంలో ఉన్నా నిత్యత్వంలో నీ జీవితం ఒక ప్రత్యేకతను కనపరుస్తుంది. గనుక నీ వ్యక్తిగత పరిచర్య పొలం వైపు చూడడం మొదలు పెట్టు. 'దేవా, యేసుక్రీస్తు గురించి నన్నెవరితో పంచుకోమంటావు' అని ప్రార్థించి 'క్రీస్తు కోసం మరొకర్ని' సంపాదించడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండు. తద్వారా సంతోషమే కాదు, సమాధానం కూడా నీ సొంతమవుతుంది (మత్తయి 5:9).

– రిక్ వారెన్

**కోశాధికారి లేఖ**

# సమర్పణ

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో వందనాలు.

"మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది సొమ్ము ఇయ్యవలెను" - 1 కొరింథీ 16:2

డా. స్టైరెట్ గారు పరిచార నాయకత్వమే గృహనిర్వాహక నాయకత్వం అని చెప్పాడు. తాను బోధించడంతో పాటు, జీవించడం ద్వారా దాన్ని చూపించాడు. మన ఆర్థిక, భౌతిక వనరులు, ఉద్యోగం, వరాలు, సమయం, తలాంతులు, ఆస్తి, బిడ్డలు అన్నీ దేవుని నుండి పొందామని నమ్మి వాటిని దేవునికి సమర్పించి దేవుని పనిలో వాడాలి. సేవక పరిచర్యకు దేవుడు మనల్ని పిలిచాడు. ప్రొ.ఇనాక్ గారు "నా ఇంటిలో తినడానికి కొంత ఉన్నంతకాలం మీరు (స్టాఫ్‌వర్కర్స్) ఆకలిగొనరు" అని చెప్పేవాడు. ఇలా గొప్ప సమర్పణతో పరిచర్య అవసరాలను తన ఇంటి అవసరాలతో సమానంగా చూశారాయన. గనుక మనం కూడా మన పితరులవలె ప్రభువుకు సమర్పించుకుందాం.

**గమనిక:** జూన్ నెల 2022లో జరిగిన రాష్ట్ర వార్షిక కౌన్సిల్ (ఏసియం 2022) నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ ఇయు, ఇజియఫ్ పరిచర్య కోసం పంపించే మంత్లీ కాంట్రిబ్యూషన్‌ను ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని, రాష్ట్ర మరియు నేషనల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమకూడిన మొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ విభజించి పంపడానికి, కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అనుమతినిస్తూ తీర్మానం చేయడం జరిగింది. కాబట్టి పరిచర్యకు ప్రతి నెలా పంపించే కాంట్రిబ్యూషన్‌ను విభజించకుండా మొత్తాన్ని ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని మనవి.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 1,00,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఆరు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
[signature]
**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**

## OCTOBER 2022

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 99.00 | Field Staff Salaries | 4,84,735.00 |
| General Fund | 14,60,664.00 | Field Staff HRA, CA, MA & TA | 2,93,814.00 |
| Staff Support | 10,400.00 | Office Staff Salaries | 1,59,189.00 |
| | | UESI | 2,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 39,231.00 |
| | | SWF | 1,42,000.00 |
| | | Closing Balance | 694.00 |
| **Total** | **14,71,163.00** | | **14,71,163.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-11-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# పండగలెందుకు?

డిసెంబర్ అనగానే మనకు గుర్తుకు వచ్చేది క్రిస్మస్ పండగ. క్రిస్మస్ అనగానే క్రిస్మస్ కేరల్స్, గ్రీటింగ్స్, క్రిస్మస్ తాత, క్రిస్మస్ చెట్టు, ఇంటిని అందంగా అలంకరించడం, క్యాండిల్స్, పశువుల పాక, జ్ఞానులు... ఇలా చెప్పుకొంటూపోతే జాబితా చాలానే ఉంటుంది. అయితే ఈ సందర్భంలో పండుగల యొక్క ఉద్దేశం ఏంటి? క్రైస్తవులు పండగలు జరుపుకుంటే ఎలా జరుపుకోవాలి అనే విషయాలను ఆచరణాత్మకంగా చర్చిద్దాం.

### పండగ - నిర్వచనము

సాధారణంగా పండగ అనగా ఒక సమాజం విశ్వసించే మత లేదా సంస్కృతి అంశాల ఆధారంగా ఆచరించే ఒక సంఘటననే పండగ లేదా సంబరం అంటారు. పండగలు జరుపుకోవడంలో ఆ సమాజం యొక్క మతపరమైన, సాంస్కృతికపరమైన విషయాలతో పాటలు, ఆచారాలు, అలవాట్లు, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయి.

### బైబిల్లో పండగలు

పాతనిబంధన గ్రంథములో ఇశ్రాయేలీయులు సమాజంగా పండగలు జరుపుకోవాలని దేవుడు ఆజ్ఞాపించాడు (నిర్గమ 34:22, లేవి 23:7). అందుకనే వారు పస్కాపండుగ, పర్ణశాలల పండగ, ప్రథమ ఫలాల అర్పణ పండగ..ఇలా ఇశ్రాయేలీయులు 7 పండగలను జరుపుకొంటారు. దేవుని ఆజ్ఞ ప్రకారం ఇశ్రాయేలీయులు జరుపుకొనే పండగల్లో ఆధ్యాత్మిక అర్థం ఇమిడి ఉంది. వారు భౌతికముగా జరుపుకునే పండగలు ఆధ్యాత్మికతవైపుకు వారిని నడిపించేవి. యెహోవా దేవుని యొక్క గొప్పతనం గూర్చి ఇతర సమాజాల వారికి వివరించడానికి ఉపయోగపడుతూ, సమాజంగా వారి యొక్క ఐక్యతను, సంఘీభావాన్ని వ్యక్తపరచేవి.

క్రొత్తనిబంధనలో యేసుక్రీస్తు ప్రభువు యూదా సంప్రదాయం ప్రకారం పండగలు జరుపుకున్నారు. ఇవి ఆయన సంపూర్ణంగా ధర్మశాస్త్రానికి లోబడడాన్ని సూచిస్తూ, ఆయన సామాజిక జీవితాన్ని తెలియజేస్తున్నాయి.

### పండగలు - క్రైస్తవ దృక్పథం

కొందరు పండగలను ఆసరా చేసుకొని శరీరాన్ని తృప్తిపరచుకోవడానికి అనగా తినడం, త్రాగడం, ఖరీదైన వస్త్రాలు మొ॥న వాటిని చేయడానికి ఉపయోగిస్తున్నారు. వాటిని మనం తప్పక ఖండించాలి.

అయితే మనం చారిత్రక సత్యాలైన యేసుక్రీస్తు జనన, మరణ, పునరుత్థానములను జ్ఞాపకం చేసుకొంటూ, తద్వారా మన జీవితాలలో జరిగిన విమోచన కార్యాన్ని తలపోసుకొంటూ ఆధ్యాత్మికతవైపుకు నడిపించే విధంగా పండగల్ని జరుపుకోవచ్చు. ఈ పండగల ద్వారా క్రీస్తునందలి మన విశ్వాసము, మనకు కలిగిన విమోచన, క్రైస్తవ జీవన విధానము ప్రతిబింబించే విధముగా ఉండాలి. పౌలు చెప్పినట్లుగా మనము ఏమి చేసినను దేవుని మహిమ కొరకు చేద్దాం (1 కొరింథీ 10:31).

క్రిస్మస్ సందర్భంలో క్రీస్తుపుట్టుక యొక్క ఆవశ్యకత, తద్వారా మానవాళికి కలిగిన విమోచన వివరించవచ్చు. గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని క్రీస్తు చనిపోతే ఎందుకు గుడ్‌ఫ్రైడే అయ్యిందో వివరిస్తూ క్రీస్తు మరణం ద్వారా మానవాళికి కలిగిన రక్షణ గూర్చి వివరించవచ్చు. ఈస్టర్‌ను ఆధారం చేసుకొని యేసుక్రీస్తు పునరుత్థానం ద్వారా మానవాళికి అనుగ్రహించిన పాపక్షమాపణల ను గూర్చి వివరిస్తూ సువార్తను పంచుకోవచ్చు. వివాదాల జోలికి వెళ్ళకుండా ఈ విధంగా పండగల ను క్రీస్తుప్రభువును పరిచయం చేయడానికి అవకాశాలు గా మలచుకొందాం. ఇతర సందర్భాలలో సువార్తను వినడానికి, క్రీస్తును గూర్చి తెలుసుకోవడానికి సు-ము ఖంగా ఉండరు కానీ పండగ సందర్భాలలో వినడానికి, క్రీస్తును గూర్చి తెలుసుకోవ డానికి ఆసక్తిని కనుపరుస్తారు. కాబట్టి సువార్తను ప్రకటించడానికి ఇదొక మంచి అవకాశం.

– **ఆర్. రాజ్‌కుమార్,** స్టాఫ్, తిరుపతి